


జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

# ఆదిలాబాద్

## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

బుధవారం 1 జూలై 2026 పేజీలు : 8


# అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి



నీతి, నిజాయితీ, సమయ పాల నతో విధులు నిర్వహించి పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంచాలి

ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

నార్నూర్ పోలీస్ స్టేషన్ ఆక స్మిక తనిఖీ

# క్లోరినేషన్ సమస్యతో బాధ పడుతున్న గ్రామానికి ఆర్‌వో వాటర్ ప్లాంట్




పరస్వాడ(కె) గ్రామానికి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

గ్రామంలో తాగునీటికి శాశ్వత పరిష్కారం

గంజాయి, గుడుంబా, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విద్య, ఆరోగ్యం, అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

# వ్యవసాయం అంటే పండగలా తీర్చిదిద్దుతాం




రైతుల నుండి 2 లక్షల 88 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి నగదు జమ చేశాం...

మహిళల ఆర్థిక అభివృద్ధికి చేయూత అందించాం... రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

జిల్లాలో పాల్గొన్న మంచిర్యాల జిల్లా కలెక్టర్, రైతులు



# అంతాపూర్‌లో కాసో.. గుడుంబా, దేశీ మద్యం స్వాధీనం




**కెరమెరి జూన్ 30 ప్రజా జ్యోతి** కెరమెరి, మండలంలోని అంతాపూర్ గ్రామంలో మంగళవారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ (కాసో) నిర్వహించి గుడుంబా, దేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాంకిడి సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో కెరమెరి ఎస్సై సుధాకర్, పోలీసు సిబ్బంది గ్రామంలో విస్తృత తనిఖీలు చేపట్టారు.తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 10 లీటర్ల గుడుంబాతో పాటు 90 మి.లీ. సామర్థ్యం గల 29 దేశీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 50 లీటర్ల బెల్లం పులుసు (జగ్గరీ వాష్)ను ధ్వంసం చేశారు.అనంతరం గ్రామస్తులతో సమావేశమైన సీఐ వేణుగోపాల్ రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని, నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100కు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పించారు. అక్రమ మద్యం నిల్వ, తయారీకి సంబంధించి కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తాడిచెర్ల బొగ్గు బ్లాక్--2, మణుగూరు పీకే ఓసీ--2 డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టును సింగరేణికి కేటాయించాలి

**కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి ఏబీకేఎంఎస్--బీఎంఎస్ విజ్ఞప్తి**

**సింగరేణి కోల్ మైన్స్ కార్మిక్ సంఘ్ (ఏబీకేఎంఎస్--బీఎంఎస్)**

**సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి -- త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ**

**ఇల్లందు పూసపల్లి ఓసీ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలి**

**12వ వేతన కమిటీ (జేబీసీసీఐ--12)ను తక్షణమే ఏర్పాటు చేయాలి**





**మంచిర్యాల, 30, జూన్ (ప్రజా జ్యోతి):** తాడిచెర్ల బొగ్గు బ్లాక్--2, మణుగూరు పీకే ఓసీ--2 డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టును సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)కు కేటాయించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక్ సంఘ్ (ఏబీకేఎంఎస్--బీఎంఎస్) నాయకులు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరారు . అదేవిధంగా ఇల్లందు పూసపల్లి ఓసీ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించడంతో పాటు 12వ వేతన కమిటీ (జేబీసీసీఐ--12)ను తక్షణమే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు . కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక్ సంఘ్ (ఏబీకేఎంఎస్--బీఎంఎస్) ప్రతినిధుల బృందం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సమగ్ర వినతిపత్రాన్ని అందజేశారు .ఈ సందర్భంగా ఏబీకేఎంఎస్ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యుడు పి. మాధవ నాయక్, అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి లు తాడిచెర్ల బొగ్గు బ్లాక్--2, మణుగూరు పీకే ఓసీ--2 డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టుల ప్రాధాన్యతను కేంద్ర మంత్రికి సవివరంగా వివరించారు. ప్రస్తుతం సింగరేణిలోని పలు బొగ్గు గనుల్లో నిల్వలు క్రమంగా తగ్గిపోతున్నాయని, భవిష్యత్తులో కొన్ని గనులు మూతపడే పరిస్థితి ఏర్పడే అవకాశముందని వారు తెలిపారు. దీని వల్ల వేలాది మంది కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని అన్నారు. తాడిచెర్ల బొగ్గు బ్లాక్--2లో సుమారు 277 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు నిల్వలు, మణుగూరు పీకే ఓసీ--2 డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టులో సుమారు 215 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని వివరించారు. బొగ్గు తవ్వకాలలో సింగరేణికి ఉన్న అపార అనుభవం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన యంత్రాంగం, మౌలిక సదుపాయాలను దృష్టిలో ఉంచుకొని ఈ రెండు ప్రాజెక్టులను సింగరేణికే కేటాయించడం సంస్థ భవిష్యత్తుకు ఎంతో అవసరమని తెలిపారు .అదేవిధంగా ఇల్లందు పూసపల్లి ఓసీ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించేలా సింగరేణి అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలని, అలాగే 12వ వేతన కమిటీ (జేబీసీసీఐ--12) ఏర్పాటు కోసం కోల్ ఇండియా యాజమాన్యంతో సంప్రదించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.వీరి వినతిపై స్పందించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తాడిచెర్ల బొగ్గు బ్లాక్--2, మణుగూరు పీకే ఓసీ--2 డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టులను సింగరేణికి కేటాయించే దిశగా త్వరలోనే చర్యలు తీసుకుంటామని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. అలాగే 12వ వేతన కమిటీ ఏర్పాటు విషయమై కోల్ ఇండియా అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి సానుకూల స్పందన సింగరేణి కార్మికుల్లో కొత్త ఆశలను నింపిందని ఏబీకేఎంఎస్--బీఎంఎస్ నాయకులు అన్నారు . ఈ సందర్భంగా సింగరేణి కార్మికుల తరపున కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి గారికి హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి. మాధవ నాయక్, మందా రమాకాంత్, పులి రాజిరెడ్డి, అప్పాని శ్రీనివాస్, వడ్డేపల్లి కుమారస్వామి, యాదగిరి సత్తయ్య, వై సారంగపాణి, జీవి కృష్ణారెడ్డి, ఎ. వెంకటేశ్వర్లు, మొగిలిపాక రవికుమార్, బి. కిషన్, అల్లి ప్రకాష్ రావు, సాయివేణి సతీష్, హరిణ్ పటేల్, నాయిని సైదులు, లీలాకృష్ణ, దశరథం, పి. శ్రీనివాస్, సత్కూరి శ్రీనివాస్, పందాల మల్లేష్, ఆర్. నర్సింగరావు, రూపేశ్వరచారి, కర్రవుల మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి వారధిగా పనిచేస్తాం

**ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల మల్లేశం**


**ఎస్‌డబ్ల్యూయూ--ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల మల్లేశం ఆధ్వర్యంలో మంచిర్యాల్ డిపో నూతన కమిటీ ఎన్నిక**




**మంచిర్యాల, 30, జూన్ (ప్రజాజ్యోతి):**ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి వారధిగా పనిచేస్తామని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల మల్లేశం అన్నారు మంచిర్యాల ఆర్టీసీ డిపోలో ఎస్‌డబ్ల్యూయూ ఐఎన్‌టీయూసీ జనరల్ బాడీ సమావేశంను మంగళవారం స్థానిక ఈబీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్‌డబ్ల్యూయూ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్రహం, రాష్ట్ర కమిటీ సభ్యులు కొమురన్న, సంపత్, రాజేందర్, భీమేశ్వర్ రావు, నాగరాజు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మంచిర్యాల్ డిపో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిపో అధ్యక్షుడిగా తోట సత్తయ్య, డిపో కార్యదర్శిగా సుదర్శన్ రెడ్డి, గ్యారేజ్ కార్యదర్శిగా రామ్మూర్తిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మిగతా సభ్యులతో కూడిన పూర్తిస్థాయి కమిటీని తదుపరి సమావేశంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సంద ర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల మల్లేశం మాట్లాడుతూ, గతంలో ఆర్టీసీలో ఉన్న కొన్ని యూనియన్లు తమ స్వార్థ ప్రయోజ నాలకోసం కార్మికులను అయోమయంలోకి నెట్టాయని విమర్శించారు. గత ప్రభుత్వాలు చేయలేని సమస్యల పరిష్కారానికి ప్రస్తుత ప్రభుత్వం కృషి చేస్తుందనే నమ్మకంతో ఎస్‌డబ్ల్యూయూ--ఐఎన్‌టీయూసీ యూనియన్ ముందుకు సాగుతోందని అన్నారు. "ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికులకు మధ్య వారధిగా ఎస్‌డబ్ల్యూ యూ--ఐఎన్‌టీయూసీ యూనియన్ పనిచేస్తుంది. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాం. మంచిర్యాల్ డిపోలో ప్రతి కార్మిక సమస్యకు అందుబాటులో ఉండి పరిష్కారా నికి చర్యలు తీసుకుంటాం" అని జక్కుల మల్లేశం తెలిపారు. అదేవిధంగా, గత ప్రభుత్వాలు పరిష్కరించలేకపోయిన ఆర్టీసీ సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరిస్తుందనే విశ్వాసం ఉందని ఆయన పేర్కొన్నారు సమావేశంలో పలువురు కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

## ఐటీఐ అడ్మిషన్ల గడువు జూలై 10 వరకు పొడిగింపు

**:ప్రిన్సిపాల్ వై. రమేష్**



**జన్నారం,జూన్30 (ప్రజాజ్యోతి)** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2026-27 విద్యా సంవత్సరం మొదటి దశ ఆన్‌లైన్ అడ్మిషన్ల దరఖాస్తు గడువును జూలై 10 వరకు పొడిగిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ డైరెక్టర్ ఎ.కాంతి వెస్లీ, ఐఏఎస్ ఉత్తర్వులు జారీ చేశారని జన్నారం ఐటిఐ ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం రోజున ప్రిన్సిపల్ మాట్లాడుతూ. అర్హులైన అభ్యర్థులు వివిధ కోర్సులలో చేరుటకు మొదటి దశ కౌన్సిలింగ్ కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని పొడగించిన తేదీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కు కళాశాల పనివేళలో తమను సంప్రదించాలని కోరారు.

# సింగరేణి అధికారుల ఆగ్రహం రెండవ రోజుకు చేరిన నిరాహార దీక్షలు

**డిమాండ్ల సాధనకు అధికారుల పోరు**

**పీఆర్పీ, పే అప్‌గ్రేడేషన్ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు**

**అధికారుల ఉద్యమం ఉధృతం-అధికారుల సంఘం నాయకులు**

**సంఘీభావం తెలుపుతున్న పలువురు నాయకులు, ఉద్యోగ సంఘాలు**



**మంచిర్యాల, 30, జూన్ (ప్రజా జ్యోతి):**సింగరేణి వ్యాప్తంగా తమ సమస్యల పరిష్కారం కోసం చేపెట్టిన రిలే నిరాహార అధికారుల దీక్షలు కొనసాగుతున్నాయి .తమ అంశం లో ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యము పట్టించుకోకపోవడం పై అధికారులు ఆగ్రహంగా ఉన్నారు .వీరి దీక్షలు మంగవారం నాటికీ రెండవ రోజు కూడా కొనసాగాయి. డిమాండ్ల సాధన కోసం అధికారుల పోచేపట్టిన పోరుకు పలువురు నాయకులు, ఉద్యోగ సంఘాలు సంఘీభావం తెలుపుతున్నారు. పీఆర్పీ, పేఅప్‌గ్రేడేషన్ సమస్యలు పరిష్కరించక పోతే సమ్మె తప్పదని అధికారుల ఉద్యమం ఉధృతం చేస్తామని అధికారుల సంఘం నాయకులు అంటున్నారు. మంచిర్యాల జిల్లాలో సింగరేణి అధికారుల సంఘం పిలుపు మేరకు శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక జీఎం కార్యాలయం వద్ద మంగళవారం రెండవ రోజు కూడా నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అధికారులు రిలే నిరాహార దీక్షలు చేపట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. అధికారులు చేపట్టిన ఈ ఆందోళన కార్యక్రమాలు రోజురోజుకు ఉధృతమవుతున్నాయి.ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు ఎల్ మహేష్ మాట్లాడుతూ, అధికారుల ప్రధాన డిమాండ్లైన రెండు సంవత్సరాల పీఆర్పీ చెల్లింపులో జరుగుతున్న జాప్యం, పే అప్‌గ్రేడేషన్, ఉచిత విద్యుత్ సదుపాయం, ఫీజు రీయింబర్స్‌మెంట్, అధికారుల ప్రమోషన్లు, బదిలీల్లో పారదర్శకత, సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి అధికారులు సంస్థను తమ సొంత సంస్థగా భావించి సమయాభావం లేకుండా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని, అలాంటి పరిస్థితుల్లో అధికారులు నిరసనలకు దిగాల్సి రావడం అత్యంత బాధాకరమని అన్నారు. గత నెల రోజులుగా ఈ నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నప్పటికీ యాజమాన్యం గానీ, ప్రభుత్వం గానీ ఎలాంటి స్పందన చూపకపోవడం ఆందోళన కలిగించే విషయమని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే సంస్థ మనుగడపైనే ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం, యాజమాన్యం అధికారుల డిమాండ్లపై సరైన నిర్ణయం తీసుకుని పీఆర్పీ చెల్లింపులు అమలు చేయాలని, పే అప్‌గ్రేడేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సమస్యల పరిష్కారంలో మరింత జాప్యం జరిగితే నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేయడంతో పాటు అవసరమైతే సమ్మెకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలో జరిగిన రెండవ రోజు రిలే నిరాహార దీక్షల్లో లిఖిత్ రెడ్డి, ఎం.డి. పర్వేజ్, జి. వెంకటేష్, శ్రావణ్, జె. వెంకటేష్, కె. నాగరాజు, పి. మహేష్, జలాలుద్దీన్, మిట్టపల్లి శ్రీనివాస్, జీవీకే కిరణ్, సాయి కిరణ్, మహేష్, రాజేష్, తోట రమేష్, మిథున్ తదితర అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్‌టీపీపీ)లో కూడా రెండవ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో పి. మహేందర్ (డీజీఎం-ఈఎన్ఎం), డి. పంతుల (డీజీఎం-ఈఎన్ఎం), జె. శ్రీనివాస్ (డీజీఎం), బి. శంకర్ (ఎస్ఈ-ఈఎన్ఎం), సందీప్ కుమార్ (డిప్యూటీ ఎస్ఈ-ఈఎన్ఎం) పాల్గొన్నారు. ఈ నాడు రెండవ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు సింగరేణి బీసీ--ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ తమ మద్దతు, సంఘీభావాన్ని ప్రకటించింది. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్లు, ఎన్‌సీడబ్ల్యూ ఉద్యోగులు, ఐఎటీయూసీ యూనియన్లు కూడా అధికారుల ఉద్యమానికి సంఘీభావం తెలుపుతూ మద్దతు ప్రకటించాయి. పలువురు నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొని అధికారుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం, యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# చత్లాపూర్ డంపింగ్ యార్డులో చెత్త నిర్వహణపై అదనపు కలెక్టర్ దృష్టి.

## స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రమాణాల అమలుపై సమీక్ష.



**మందమర్రి జూన్ 30 (ప్రజాజ్యోతి ):**చత్లాపూర్ గ్రామ శివారులోని డంపింగ్ యార్డును అదనపు జిల్లా కలెక్టర్ (లోకల్ బాడీస్) మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యార్డులో చెత్త నిర్వహణ తీరును పరిశీలించి, పారిశుద్ధ్య పనులపై అధికారులతో చర్చించారు.స్వచ్ఛ సర్వేక్షణ్--2026 మార్గదర్శకాల ప్రకారం తడి, పొడి, హానికర, శానిటరీ వ్యర్థాలను విడివిడిగా సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని పేర్కొన్నారు. డంపింగ్ యార్డులో పరిశుభ్రత ప్రమాణాలు మరింత మెరుగుపరచాలని అధికారులను కోరారు.అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఇటీవల అకౌంట్స్ విభాగంలో నేల కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే మీ సేవా కేంద్రంలో ప్రజలతో మాట్లాడి, సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.స్వచ్ఛ సర్వేక్షణ్ నేపథ్యంలో మున్సిపాలిటీల పనితీరును మెరుగుపర్చేందుకు ఇటువంటి ఆకస్మిక తనిఖీలు ఉపయోగపడనున్నాయి.

## ఓటరు గణన తప్పనిసరి: శ్యాంనాయక్



**ఆసిఫాబాద్, జూన్ 30 ప్రజా జ్యోతి** దేశ పౌరులైన ప్రతి ఒక్కరూ ఓటరు గణన పూర్తి చేసుకోవాలని ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి అజ్మీర శ్యాంనాయక్ అన్నారు. సోమవారం ఆయన తన ఎన్యూమరేషన్ ఫారంను నింపి బీఎల్ఓకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారత పౌరుడు ఓటు హక్కు కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సమీపంలోని బీఎల్ఓను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన అధికారులకు ఐఎన్‌టీయూసీ నాయకుల ఘన సన్మానం

**సింగరేణి అభివృద్ధికి విశేష సేవలందించిన అధికారులను ప్రశంసించిన జెట్టి శంకర్ రావు**



**మంచిర్యాల, 30, జూన్ (ప్రజా జ్యోతి):**మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఎస్వో టు జనరల్ మేనేజర్ నల్లగుంట సత్యనారాయణను ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు. పూలగుచ్ఛం, జ్ఞాపిక అందించి శాలువాతో సత్కరించి హృదయపూర్వక పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు మాట్లాడుతూ, నల్లగుంట సత్యనారాయణ సింగరేణిలో సుదీర్ఘకాలం వివిధ కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి, భద్రత, కార్మిక సంక్షేమానికి విశేష సేవలందించారని ప్రశంసించారు. నిబద్ధత, క్రమశిక్షణ, సమన్వయంతో విధులు నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా, దీర్ఘాయుష్షుతో జీవిస్తూ తన అనుభవాన్ని సమాజ సేవకు వినియోగించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా శ్రీరాంపూర్ ఏరియా సీహెచ్‌పీ విభాగంలో పదవీ విరమణ పొందుతున్న ఎలక్ట్రిషియన్ సాగి శ్రీనివాస్ రావును కూడా ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెట్టి శంకర్ రావు మాట్లాడుతూ సాగి శ్రీనివాస్ రావు విధి నిర్వహణలో క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారని, సహోద్యోగులు, కార్మికులతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ తన విభాగంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ సంస్థకు విశిష్ట సేవలందించారని తెలిపారు. తోటి ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర నాయకులు గరిగ స్వామి, పి. తిరుపతి రాజు, సీహెచ్‌పీ నాయకులు సతీష్, తిరుపతి రెడ్డి, కార్మికులు, అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని పదవీ విరమణ పొందిన అధికారులకు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థినుల భద్రతకు షీ టీమ్ అండగా నిలుస్తుంది

**అవసరమైనప్పుడు ధైర్యంగా "నో" చెప్పడం నేర్చుకోవాలి**

**మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్**



**మంచిర్యాల, 30, జూన్ (ప్రజా జ్యోతి):**మహిళలు, బాలికలు వేధింపులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకుండా వెంటనే షీ టీమ్‌ను ఆశ్రయించాలని, విద్యార్థులు జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలంటే అవసరమైనప్పుడు ధైర్యంగా "నో" చెప్పడం నేర్చుకోవాలని మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో మంచిర్యాల షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ ఉషారాణి ఆధ్వర్యంలో మంగళవారం షీ టీమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీ ఏ. భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, మహిళలు, విద్యార్థినుల భద్రత, ఆత్మవిశ్వాసం, గౌరవాన్ని పరిరక్షించడమే షీ టీమ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే భయపడాల్సిన అవసరం లేదని, కేసు నమోదు చేస్తే భవిష్యత్తు దెబ్బతింటుందనే అపోహలను విడిచిపెట్టాలని సూచించారు. విద్యార్థినులు, మహిళలు తమకు ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా షీ టీమ్ దృష్టికి తీసుకురావాలని కోరారు. షీ టీమ్‌కు ఫిర్యాదు అందిన వెంటనే సభ్యులు బాధితురాలిని గోప్యంగా సంప్రదించి సమస్యను పూర్తిగా తెలుసుకుని, అవసరమైన విచారణ నిర్వహించి తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. సామాజిక మాధ్యమాలు, ఫోన్ కాల్స్, సందేశాలు లేదా ప్రత్యక్షంగా ఎలాంటి వేధింపులు ఎదురైనా వాటిని సహించకుండా వెంటనే షీ టీమ్‌ను సంప్రదించాలని సూచించారు. "పోనీలే" అనే భావనతో వేధింపులను భరిస్తే అవి మరింత పెరిగే అవకాశం ఉంటుందని, అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ మౌనంగా ఉండవద్దని విద్యార్థినులకు సూచించారు. విద్యాసంస్థలు, వసతి గృహాలు, నివాస ప్రాంతాలు, ఉద్యోగ ప్రదేశాలు లేదా ప్రయాణ సమయంలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైనా షీ టీమ్ సహాయం తీసుకోవాలని, మహిళల భద్రత కోసం షీ టీమ్ 24 గంటలూ పనిచేసే ప్రత్యేక పోలీసు విభాగమని తెలిపారు. ప్రతి విద్యార్థిని తన సమస్యను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా షీ టీమ్‌తో వెంటనే పంచుకోవాలని, సమస్యలను దాచిపెట్టకుండా ధైర్యంగా ముందుకు వస్తే పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని అన్నారు. విద్యార్థులు జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలంటే అవసరమైనప్పుడు ధైర్యంగా "నో" చెప్పడం నేర్చుకోవాలని డీసీపీ సూచించారు. ప్రతి విషయానికీ "ఎస్" చెప్పడం కంటే తమకు ఇష్టం లేని, భవిష్యత్తుకు హాని కలిగించే విషయాలను ధైర్యంగా తిరస్కరించే వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే "నో" చెప్పే ధైర్యాన్ని పెంపొందించాలని, జీవితంలో అనేక సమస్యలకు మూల కారణం ఇష్టం లేకపోయినా తిరస్కరించలేకపోవడమేనని వివరించారు. ఇతరులను చూసి చదువులు లేదా వృత్తులను ఎంచుకోవడం కంటే తమ ఆసక్తులు, ప్రతిభ, సామర్థ్యాలను గుర్తించి వాటికి అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, ఆ ప్రతిభను గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో చదువు, ఉద్యోగం, వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే ఒత్తిడులు, ప్రలోభాల మధ్య సరైన నిర్ణయాలు తీసుకునేందుకు విశ్లేషణాత్మక ఆలోచనతో పాటు అవసరమైనప్పుడు "నో" చెప్పగల ధైర్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమస్యలను చూసి భయపడకుండా ముందుగా వాటిని సరిగా అర్థం చేసుకుని, వాటి మూల కారణాన్ని గుర్తిస్తే పరిష్కారం సులభంగా దొరుకుతుందని తెలిపారు. గణిత సమస్యను పరిష్కరించినట్లే జీవితంలోని ప్రతి సమస్యను ప్రశాంతంగా విశ్లేషించి, సరైన ప్రణాళికతో ముందుకు సాగితే ఏ సవాలునైనా అధిగమించవచ్చని డీసీపీ ఏ. భాస్కర్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ ఉషారాణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అనూష, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సింగరేణి అధికారుల దీక్షకు టీబీజీకేఎస్ పూర్తి సంఘీభావం

**అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి**

**టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి**



**మంచిర్యాల, 30, జూన్ (ప్రజాజ్యోతి):** సింగరేణి అధికారుల దీక్షకు టీబీజీకేఎస్ సంపూర్ణంగా సంఘీభావం తెలుపుతున్నామని సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి తెలిపారు .మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట సింగరేణి అధికారుల సంఘం (సీఎంఓఏ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని మంగళవారం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాయకులు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. సింగరేణి అధికారుల న్యాయమైన హక్కుల సాధన కోసం చేపట్టిన పోరాటానికి తమ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లైన పీఆర్పీ బకాయిలను వెంటనే చెల్లించడంతో పాటు పే అప్‌గ్రేడేషన్‌ను తక్షణమే అమలు చేయాలని సంస్థ యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారులు, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించడం సంస్థ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని అన్నారు. అధికారుల హక్కుల సాధన కోసం చేపట్టిన ఈ నిరాహార దీక్షకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పూర్తిస్థాయి మద్దతు ఉంటుందని, కార్మికులు--అధికారుల ఐక్యతతోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు పీఆర్పీ సాధన కోసం సింగరేణి అధికారులు మరియు వారి సంఘం చేపడుతున్న ఉద్యమం న్యాయబద్ధమైనదేనని, దీనిపై యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పోగాకు రమేష్, ఏరియా కార్యదర్శి గద్దం మహిపాల్ రెడ్డి తదితర నాయకులు పాల్గొని అధికారుల దీక్షకు సంఘీభావం తెలిపారు.

# మహాప్రస్థానంపై బీజేపీ ఆరోపణలు నిరాధారం

**మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్**

**ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు బీజేపీ నాయకులు క్షమాపణ చెప్పాలి**

**మంచిర్యాల, 30, జూన్ (ప్రజాజ్యోతి):**మంచిర్యాల లోని మహాప్రస్థానంపై బీజేపీ ఆరోపణలు నిరాధారమైనవని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు బీజేపీ నాయకులు క్షమాపణ చెప్పాలని మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ డిమాండ్ చేశారు . మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు మంగళవారం మంచిర్యాల కాలేజ్ రోడ్డులోని మహాప్రస్థానంలో పాత్రికేయుల సమావేశంను మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, కార్పొరేటర్లు స్రవంతి, హరికృష్ణ, పట్టణ మహిళా అధ్యక్షురాలు హేమలత పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నియోజకవర్గంలో విద్య, వైద్యం, నగర అభివృద్ధి రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలను బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. అందుకే మున్సిపల్ అజెండా పూర్తి కాకముందే సమావేశాన్ని బహిష్కరించి అనవసర గొడవలు సృష్టించారని విమర్శించారు. కేంద్ర నిధులతోనే అభివృద్ధి జరుగుతుందని బీజేపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని పేర్కొన్నారు. దేశంలోని రాష్ట్రాల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు సమన్వయం పాటించడం లేదని ప్రశ్నించారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎలాంటి వివక్ష లేదని స్పష్టం చేశారు. మంచిర్యాల కాలేజ్ రోడ్డులోని మహాప్రస్థానంలో దోపిడి జరుగుతుందంటూ బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. తప్పుడు ఆరోపణల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ, వెంటనే ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు బీజేపీ నాయకులు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ కార్పొరేటర్లు, నాయకులపై కేసు



**మంచిర్యాల, 30, జూన్ (ప్రజాజ్యోతి):**మంచిర్యాల నగరపాలక సంస్థ లో సోమవారం జరిగిన సమావేశానికి ఆటంకం కలిగించిన బీజేపీ కార్పొరేటర్లు, నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం జరిగిన సమావేశాన్ని వాకౌట్ చేసిన కార్పొరేటర్లు ముథినేని గౌడ్, కస్తూరి నాగరాజ్, బొట్ల అనితతో పాటు కార్యకలాపాలను అడ్డుకున్నందుకు రమేష్, జయరాం, బోరి శ్రీనివాస్, రాజ్ కుమార్, బొట్ల సత్యనారాయణ, బీర సత్యనారాయణపై మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతిని ప్రశ్నిస్తే కేసులా?

**బీజేపీ నేతల ఆగ్రహం**

**అక్రమ కేసులు ఎత్తివేయాలని అదనపు కమిషనర్‌కు ఫిర్యాదు**



**మంచిర్యాల, 30, జూన్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి, ప్రజా సమస్యలపై ప్రశ్నించిన బీజేపీ కార్పొరేటర్లు, నాయకులపై అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపిస్తూ బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు మంగళవారం అదనపు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బీజేపీ కార్పొరేటర్ కస్తూరి నాగరాజు, అమిరిశెట్టి రాజ్‌కుమార్, బొట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజా సమస్యలు, కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు సంబంధించిన అంశాలపై ప్రశ్నించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి, సమస్యలపై నిలదీయడాన్ని జీర్ణించుకోలేక రాజకీయ కక్షసాధింపు ధోరణితో తమపై కేసులు నమోదు చేశారని ఆరోపించారు. ప్రజల తరఫున పోరాడుతున్న నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ సమావేశానికి ఆటంకం కలిగించినందుకు బీజేపీ కార్పొరేటర్లు, నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం నిర్వహించిన కార్పొరేషన్ సమావేశంలో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా, అనంతరం బీజేపీ కార్పొరేటర్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఈ క్రమంలో వాకౌట్ చేసిన కార్పొరేటర్లు ముథినేని గౌడ్, కస్తూరి నాగరాజ్, బొట్ల అనితతో పాటు కార్యకలాపాలను అడ్డుకున్నారనే ఆరోపణలపై రమేష్, జయరం, బోరి శ్రీనివాస్, రాజ్‌కుమార్, బొట్ల సత్యనారాయణ, బీర సత్యనారాయణపై మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. తమపై నమోదు చేసిన కేసులు అక్రమమని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొన సాగుతుందని, కేసులకు భయపడేది లేదని వారు స్పష్టం చేశారు.

# ఎస్ఓ టు జీఎంగా గత రెండేళ్లుగా శక్తివంచనలేకుండా పనిచేశారు

### శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్

### సింగరేణికి విశిష్ట సేవలు అందించిన ఎన్. సత్యనారాయణ దంపతులకు ఘన సన్మానం



**మంచిర్యాల, 30, జూన్ (ప్రజాజ్యోతి):** సుదీర్ఘకాలం సింగరేణి సంస్థలో విశిష్ట సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందుతున్న శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ -- అరుణ దంపతులను మంగళవారం ఘనంగా ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్. సత్యనారాయణ గత రెండేళ్లుగా ఎస్ఓ టు జీఎంగా శక్తివంచనలేకుండా పనిచేశారని, సింగరేణి సంస్థకు ఎన్నో ఏళ్ల పాటు విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. సింగరేణిలో దాదాపు 39 సంవత్సరాలపాటు సేవలు అందించిన ఎన్. సత్యనారాయణ ఓవర్‌మెన్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, మేనేజర్‌గా, ఏజెంట్‌గా, ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ అనేక గనులను ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిపారని తెలిపారు. అంతేకాకుండా గనుల జీవితకాల పెంపులోనూ ఆయన విశేష కృషి చేశారని అన్నారు. ప్రస్తుతం జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఎస్ఓ టు జీఎంగా పదవీ విరమణ పొందుతున్న ఎన్. సత్యనారాయణ, ఆయన సతీమణి అరుణలను జీఎం మునిగంటి శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జనరల్ మేనేజర్ కార్యాలయ సిబ్బంది, అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్ యూనియన్ ప్రతినిధులు ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్. సత్యనారాయణ మాట్లాడుతూ, జీఎం మునిగంటి శ్రీనివాస్‌తో కలిసి ఒకే పాఠశాలలో చదువుకోవడంతో పాటు సింగరేణిలోనూ అనేక సందర్భాల్లో కలిసి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఉత్పత్తి సంబంధిత హోదాల్లో రాణించడమే కాకుండా ఎస్ఓ టు జీఎంగా గత రెండేళ్లుగా అందరి సహకారంతో బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు . అలాగే పదవ తరగతి పూర్తయిన అనంతరం తాను రాసుకున్న కవితను సభలో వినిపిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో తమ విధులను నిర్వర్తించాలని ఆకాంక్షిస్తూ సహచరులకు వీడ్కోలు పలికారు. జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే తనకు సత్యనారాయణ సీనియర్‌గా ఉండటమే కాకుండా, సింగరేణిలో వివిధ దశల్లో ఆయన ప్రోత్సాహం మరువలేనిదని తెలిపారు. ముఖ్యంగా శ్రీరాంపూర్ ఏరియాలో జరిగిన సేఫ్టీ ట్రైపార్టైట్ సమావేశం, ఇటీవల నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి కార్యక్రమం విజయవంతం కావడంలో సత్యనారాయణ సహకారం ఎంతో కీలకమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి బాజీ సైదా, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, ఏఎస్ఓ విజయ్ కుమార్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మి, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, డీవైపీఎం క్రాంతి కుమార్, పిట్ కార్యదర్శి సందీప్, జీఎం కార్యాలయ విభాగాధిపతులు, అధికారులు, ఉద్యోగులు, వివిధ యూనియన్ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తింపు సంఘం ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలు, అంశాలు అన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తాము

**శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**

**జీఎం అధ్యక్షతన గుర్తింపు సంఘంతో స్ట్రక్చర్ కమిటీ సమావేశం**



**మంచిర్యాల, 30, జూన్ (ప్రజాజ్యోతి):**గుర్తింపు సంఘం ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలు, అంశాలు అన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆయన అధ్యక్షతన గుర్తింపు సంఘం ప్రతినిధులతో స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మే నెల స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై సమీక్ష నిర్వహించారు. గత సమావేశంలో లేవనెత్తిన అంశాల పరిష్కారానికి చేపట్టిన చర్యలు, ఇప్పటికే పరిష్కరించబడిన సమస్యల వివరాలను గుర్తింపు సంఘం ప్రతినిధులకు అధికారులు వివరించారు. తమ పరిధిలో పరిష్కరించదగిన అంశాలను దాదాపు పూర్తి చేశామని, కార్పొరేట్ పరిధిలో ఉన్న అంశాలు మరియు ఇతర అనుమతులతో చేపట్టాల్సిన పనులను త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. జూన్ నెల స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఏరియా పరిధిలోని వివిధ గనుల్లో ఉద్యోగుల సౌకర్యార్థం చేపట్టాల్సిన కార్యక్రమాలను గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులు జీఎం దృష్టికి తీసుకువచ్చారు. అన్ని గనులు, పని ప్రదేశాలలో రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యంగా అవసరమైన పనిముట్లు, యంత్రాల సమీకరణతో పాటు ఉద్యోగుల సౌకర్యార్థం గనుల పరిధిలో ఏర్పాటు చేయాల్సిన అంశాలను వివరించారు. అదేవిధంగా ఉద్యోగులు నివసించే కాలనీలు, క్వార్టర్లలో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాలు, డిస్పెన్సరీలలో కల్పించాల్సిన వసతుల వివరాలను కూడా సమావేశంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి సింగరేణి సంస్థ అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఉద్యోగుల సౌకర్యార్థం అన్ని రకాల చర్యలు చేపట్టేందుకు సంస్థ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఉద్యోగులు, కార్మిక సంఘాలు నాణ్యమైన ఉత్పత్తి ద్వారా సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో గుర్తిం.పు సంఘం శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఏరియా ఇంజనీర్ టీ. రమణరావు, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, ఆర్కే--7 గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ రవికుమార్, శ్రీరాంపూర్ ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీజీఎం (వర్క్‌షాప్) కృష్ణారెడ్డి, డీజీఎం (స్టోర్స్) మల్లయ్య, డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, డీవై సీఎంఓ రమేష్ బాబు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, సివిల్ విభాగం డీవైఎస్ఈలు సత్యనారాయణ, గుండేరావు, సీనియర్ పీఓ ప్రశాంత్, ఇతర అధికారులు, గుర్తింపు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# మీ సేవలు పోలీసు శాఖకు చిరస్మరణీయం

## అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్

### మూడు దశాబ్దాల ప్రజాసేవకు వీడ్కోలు పలికిన పోలీసు సిబ్బందికి ఘన సన్మానం





**మంచిర్యాల, 30, జూన్ (ప్రజాజ్యోతి):** మూడు దశాబ్దాలకు పైగా ప్రజాసేవలో విశిష్ట సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు అధికారులకు రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్ పదవీ విరమణ పొందుతున్న ఎస్ఐలు ఠాకూర్ సహదేవ్ సింగ్, మహమ్మద్ అహ్మదుల్లా, మేకల మహేందర్ రెడ్డి, ఏఎస్ఐలు బోయ శ్రీనివాస్, మహమ్మద్ అమానుల్లా, ఏఆర్ ఎస్ఐ పి. వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ బొట్ల చేరాలులను పూలమాలలు, శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకు పైగా పోలీసు శాఖలో క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో సేవలందించిన సహోద్యోగులు తమ ఉద్యోగ జీవితానికి వీడ్కోలు పలుకుతున్నారని తెలిపారు. పోలీసు ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాదని, ప్రజల భద్రత కోసం వ్యక్తిగత సుఖాలు, కుటుంబ సమయాన్ని కూడా త్యాగం చేస్తూ నిర్వర్తించే గొప్ప బాధ్యత అని అన్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ప్రజల రక్షణ కోసం వారు అందించిన సేవలు పోలీసు శాఖ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని చెప్పారు. ఉద్యోగ విరమణ పొందుతున్న సిబ్బంది అనుభవం, క్రమశిక్షణ, సేవాభావం యువ పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. విధి నిర్వహణలో సంపాదించిన గౌరవం, ప్రజల విశ్వాసం, మంచి పేరు జీవితంలో అత్యంత విలువైన సంపద అని అన్నారు. ఉద్యోగ విరమణ అనేది సేవా జీవితానికి ముగింపు మాత్రమేనని, కొత్త జీవిత అధ్యాయానికి ప్రారంభమని పేర్కొంటూ, ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, తమ అనుభవాన్ని సమాజానికి మార్గదర్శకంగా అందించాలని ఆకాంక్షించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ తరపున ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలియజేస్తూ వారి సేవలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ రమేష్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ గోపి, ఆర్ఐలు దామోదర్, శేఖర్, పెద్దన్న, రమేష్, సీపీఓ సూపరింటెండెంట్లు ఇంద్రసేనారెడ్డి, మనోజ్ కుమార్, సందీప్, సంధ్య, సీసీ హరీష్, ఆర్ఎస్ఐలు వెంకట్, సరిత, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ ఫీజుల దోపిడీని అరికట్టాలి

## ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్




**మంచిర్యాల, 30, జూన్ (ప్రజాజ్యోతి):** జిల్లాలో కార్పొరేట్ ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ డిమాండ్ చేశారు. జిల్లాలోని కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ నిలువు దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నిరసన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్ మాట్లాడుతూ, జిల్లాలోని కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల పేరుతో తల్లిదండ్రులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయని ఆరోపించారు. అడ్మిషన్ ఫీజులు, ఫీజు కన్ఫర్మేషన్ పేరుతో భారీ మొత్తాలు వసూలు చేస్తూ, పుస్తకాలు, యూనిఫాంల పేర్లతో కూడా అదనపు భారం మోపుతున్నాయని విమర్శించారు. జిల్లాలోని కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని పేర్కొన్నారు. ఈ అంశాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. కొన్ని కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు అధికారులను సైతం లెక్కచేయకుండా వ్యవహరిస్తూ, ప్రశ్నించే వారిపై ఎదురుదాడికి దిగుతున్నాయని ఆరోపించారు. అధిక ఫీజులు చెల్లించే స్తోమత లేని వారు ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని సూచించడం బాధాకరమన్నారు. పాఠశాలల పేర్లతోనే పుస్తకాలను ముద్రించి అధిక ధరలకు విక్రయించడం జరుగుతోందని, పాఠశాలల సమీపంలో అద్దె గదులు తీసుకుని బహిరంగంగానే పుస్తకాల విక్రయాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ నిబంధనల ను ఉల్లంఘిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. టెక్నో, ఐఐటీ, నీట్, స్మార్ట్, సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్, కాన్సెప్ట్ వంటి పేర్లతో కనీస మౌలిక వసతులు లేకుండానే ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇతర విద్యార్థి సంఘాలతో కలిసి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్, జిల్లా కన్వీనర్ జాబు ఆశిష్ కుమార్, ఇర్ఫాన్, అశ్వంత్, సంతోష్, అంజి తదితర నాయకులు పాల్గొన్నారు.

## రిలయబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం. ఎస్సై ఉదయ్ కిరణ్



**జన్నారం,జూన్30(ప్రజాజ్యోతి)**నిరుపేద పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న "రిలయబుల్" ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఎస్సై ఉదయ్ కిరణ్ అన్నారు. జన్నారం మండలంలోని రాంపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో రాంపూర్, తిమ్మాపూర్, తపాలాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలోని 380 విద్యార్థులకు రూ.2 లక్షల విలువైన విద్యా, క్రీడా సామాగ్రి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి పేద విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడా విద్యా సామాగ్రి అందజేయడం గొప్ప విషయం అన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని చదువుల్లో, క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక హెచ్ఎం ప్రభావతి, సర్పంచ్ నూతి రామయ్య, ఉప సర్పంచ్ ఒడ్డేటి వెంకటేష్, తిమ్మాపూర్ సర్పంచ్ గుగ్లావత్ సంగీత- రవి, ఉప సర్పంచ్ వేముల నాగేష్, తాళ్లపేట మాజీ ఎంపీటీసీ కంది హేమలత - సతీష్ కుమార్, రిలయబుల్ ట్రస్ట్ అధ్యక్షులు తుపాకుల రవి, గుమ్మడి రాజలింగు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ గుమ్మడి కిరణ్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సుమలత, స్థానిక నాయకులు ఉన్నారు...

## ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి.. పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేయాలి

**జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పూరెళ్ల నితీష్**

**జులై 2 కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలి**



**మంచిర్యాల, 30, జూన్ (ప్రజాజ్యోతి):** పాత పద్ధతిలోనే ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జులై 2న చేపట్టనున్న కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పూరెళ్ల నితీష్ మంగళవారం పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, బీసీ ఐకాస చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ బంద్‌కు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘాలు పూర్తి మద్దతు ప్రకటించాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా, రాష్ట్రంలోని సుమారు 14 లక్షల మంది పేద ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు బకాయిలను ఇప్పటివరకు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీని వల్ల పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లాలోని అన్ని ప్రైవేట్ కళాశాలలు, విద్యార్థి సంఘాలు, విద్యార్థులు జులై 2న నిర్వహించే బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పవన్, సాయితేజ, విష్ణు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల అవసరాలే ప్రాధాన్యం సర్పంచ్

**ప్రజల సమస్యల పరిష్కారంలో రాజంపేట పంచాయతీ ముందంజ**

**తాగునీటి సమస్యకు పరిష్కారం**



**ఆసిఫాబాద్ జూన్ 30 (ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండల కేంద్రం లోని రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలోని సాయిబాబా గుడి వెనుక గల్లీలో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారంగా నూతన బోరింగ్‌ను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బుర్సా పోచయ్య, వార్డు సభ్యుడు, ఫోరం అధ్యక్షుడు గులాం జావిద్ కొబ్బరికాయ కొట్టి బోరింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపడుతున్నామని, ప్రజల ప్రాథమిక అవసరాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఈ బోరింగ్‌తో ఆ ప్రాంత ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తీరనున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మామిడి లక్ష్మి, వార్డు సభ్యులు బొట్టుపెల్లి లావణ్య, ప్రశాంత్, నాయకులు కుంరం వేణు, జాబరి కిషోర్‌తో పాటు స్థానికులు అబ్దుల్లా, ఆసిఫ్, రాజు, దేవిడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. బోరింగ్ ఏర్పాటు కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ గ్రామపంచాయతీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఇరిగేషన్ శాఖలో పదవీ విరమణ పొందిన చీఫ్ ఇంజనీర్ సత్యరాజ్ చంద్రకు ఘన సన్మానం



**మంచిర్యాల, 30, జూన్ (ప్రజాజ్యోతి):**మంచిర్యాల జిల్లాలో ఇరిగేషన్ శాఖలో గత 38 సంవత్సరాలుగా సుదీర్ఘకాలం సేవలు అందించిన చీఫ్ ఇంజనీర్ సత్యరాజ్ చంద్ర పదవీ విరమణ సందర్భంగా టీఎన్జీవో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మాన కార్యక్రమంను నిర్వహించారు. టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సత్యరాజ్ చంద్రను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఆయన ఇరిగేషన్ శాఖలో చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించి శాఖ అభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి బొద్దు శ్రావణ్ కుమార్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షులు తిరుపతి రాంకుమార్, సంయుక్త కార్యదర్శి సునీత, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్, సెక్రటరీ అజయ్, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షులు వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మోసిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ పెంపుపై పోరాటం చేస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ఘన సన్మానం

### కనీస పెన్షన్ రూ.10 వేల వరకు పెంచే వరకు పోరాటం కొనసాగిస్తా ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**మంచిర్యాల, 30, జూన్ (ప్రజాజ్యోతి):** సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు కనీస పెన్షన్‌ను రూ.10 వేల వరకు పెంచాలని పార్లమెంట్‌లో గళం విప్పిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసి శాలువాతో ఘనంగా ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ, గత కొన్ని నెలల క్రితం సింగరేణి మరియు కోల్ ఇండియా వ్యాప్తంగా పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని వినతిపత్రం ద్వారా ఎంపీ గడ్డం వంశీకృష్ణ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ముఖ్యంగా అతి తక్కువ పెన్షన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగుల జీవన పరిస్థితులు అత్యంత దుర్భరంగా మారాయని, వారికి న్యాయం జరిగేలా కోల్ ఇండియా యాజమాన్యం మరియు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి పెన్షన్ పెంపుదలకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు విశ్రాంత ఉద్యోగుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని సింగరేణి, కోల్ ఇండియా పరిధిలో అతి తక్కువ పెన్షన్ పొందుతున్న పెన్షన్‌దారుల కు కనీస పెన్షన్ రూ.10 వేల వరకు పెంచాలని పార్లమెంట్‌లో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లిన ఎంపీ గడ్డం వంశీకృష్ణకు విశ్రాంత ఉద్యోగుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన కీర్తిశేషులు గడ్డం వెంకటస్వామి కృషి వల్లే బొగ్గు కార్మికులకు మూడవ ప్రయోజనంగా కోల్ మైన్స్ పెన్షన్ అమలులోకి వచ్చిందని, అదే స్ఫూర్తితో ఆయన మనవడైన ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంట్ వేదికగా పెన్షన్ పెంపు కోసం పోరాడటం అభినందనీయమని అన్నారు. గత 25 సంవత్సరాల్లో పెన్షన్ పెంపుపై పార్లమెంట్‌లో మాట్లాడిన ఎంపీలు లేరని, కానీ యువ ఎంపీ గడ్డం వంశీకృష్ణ కార్మికుల సమస్యలపై ముందుకు రావడం విశేషమని తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు ఎస్‌బీఐ బ్యాంకు తరహాలో యూనియన్ బ్యాంక్‌తో పాటు ఇతర బ్యాంకుల్లో కూడా రూ.30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, అలాగే హెల్త్ కార్డు పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచాలని, గ్రాట్యుటీ పరిమితి రూ.20 లక్షలను 2016 నుంచే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. అదేవిధంగా 1989లో అమలులోకి వచ్చిన కోల్ మైన్స్ పెన్షన్ ఒప్పందాన్ని పునఃసమీక్షించి కరువు భత్యంతో కూడిన 50 శాతం పెన్షన్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా స్పందించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ, సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, కనీస పెన్షన్ రూ.10 వేల వరకు పెరిగే వరకు తన పోరాటం కొనసాగుతుందని హామీ ఇచ్చారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**– జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**చెన్నూర్‌లో నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**



**మంచిర్యాల, 30, జూన్ (ప్రజాజ్యోతి):**జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. మంగళవారం చెన్నూర్ మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మిస్తున్న నైపుణ్య అభివృద్ధి కేంద్రం పనులను పరిశీలించిన కలెక్టర్, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ కేంద్రం కీలకమని పేర్కొన్నారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ప్రభుత్వం వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని పేర్కొంటూ పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు గుత్తేదారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్‌తో కలిసి అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపడుతున్న నీటి ట్యాంకు, పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలించి వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తదుపరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు తదితర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. అలాగే మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన ఫిజిక్స్ సబ్జెక్టులో వారి అభ్యాస సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 3, 4, 11 వార్డుల్లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను మండల తహసీల్దార్ మల్లికార్జున్‌తో కలిసి పరిశీలించారు. జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, వాటిని సేకరించాలని సూచించారు. జూలై 1 నాటికి ఫారాల పంపిణీ పూర్తి చేసి ప్రతిరోజూ పురోగతి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థులతో కలిసి భోజనం చేసిన చైర్మన్

బెడ్‌షీట్ల పంపిణీ.. ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని సూచన



**ఆసిఫాబాద్ జూన్ 30 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి మండలంలోని కేజీబీవీ పాఠశాలను చైర్మన్ సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం విద్యార్థులకు బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ప్రభుత్వం త్వరలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తోందని, కష్టపడి చదివే ప్రతి విద్యార్థికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు నీట్, ఐఐటీ వంటి ప్రవేశ పరీక్షలకు ఉచిత కోచింగ్ కల్పిస్తున్నట్లు చెప్పారు.ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల్లో సీట్లు సాధించేలా లక్ష్యంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శివచరణ్, ఎస్‌వో రైషా, పాఠశాల సిబ్బంది, మండల పార్టీ అధ్యక్షుడు నారాయణ, సర్పంచ్ కృష్ణాజీ, మేఘాజీ తదితరులు పాల్గొన్నారు.

## అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం అందించాలి

అధికారుల సమన్వయంతో చర్యలు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ కె. హరిత



**ఆసిఫాబాద్ జూన్ 30 ప్రజా జ్యోతి**జిల్లాలో అట్రాసిటీ బాధితులకు సత్వరమే న్యాయం, ఆర్థిక సహాయం అందేలా అన్ని శాఖల అధి కారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిట రింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జనవరి 1 నుంచి మే 30 వరకు జిల్లాలో 18 అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని, బాధితులకు త్వరితగతిన న్యాయం, ఆర్థిక సహాయం అందించేం దుకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నామని తెలిపారు. ప్రస్తు తం నమోదైన కేసులు విచారణ దశలో ఉన్నాయని చెప్పారు.ప్రతి నెల 30వ తేదీన మండల స్థాయిలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరై బాధితుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అట్రాసిటీ బాధితులకు భరోసా కల్పిస్తూ చట్టప్రకారం న్యాయం అందేలా అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు.సమావేశంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, డీఎస్పీలు వహీదుద్దీన్, అశోక్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి అశోక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీరాంపూర్ ఏరియ సింగరేణి అధికారుల పోరాటాలకు సంఘీభావం ప్రకటించిన గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ

### పీఆర్పీ అమలు చేసి పే అప్‌గ్రేడేషన్ కల్పించాలని డిమాండ్



**మంచిర్యాల, 30, జూన్ (ప్రజాజ్యోతి):**సింగరేణి వ్యాప్తంగా అధికారులు పీఆర్పీ (పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే) అమలు చేయడంతో పాటు కోల్ ఇండియాలో అధికారులకు పెరిగిన జీతాలను సింగరేణి అధికారులకు కూడా వర్తింపజేయాలని గత రెండు రోజులుగా చేపడుతున్న పోరాటాలకు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సంఘీభావం ప్రకటించింది. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి అధికారులు చేస్తున్న దీక్ష శిబిరం వద్దకు నాయకులు వెళ్లి సంఘీభావంను ప్రకటించారు .ఈ మేరకు సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముష్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా మాట్లాడుతూ, సింగరేణి అధికారులకు గత రెండు సంవత్సరాలుగా రావాల్సిన పీఆర్పీని వెంటనే చెల్లించాలని కోరారు. అదేవిధంగా కోల్ ఇండియాలో అధికారులకు అమలు చేస్తున్న పే అప్‌గ్రేడేషన్‌ను సింగరేణి అధికారులకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 1994--95 సంవత్సరంలో సింగరేణి సంస్థ నష్టాల్లో కూరుకుపోయి బీఐఎఫ్ఆర్ పరిధిలోకి వెళ్లిన సమయంలో కార్మికులు, అధికారులు సమిష్టిగా కృషి చేసి సంస్థను లాభాల బాట పట్టించారని గుర్తు చేశారు. ప్రస్తుతం సంస్థలో రాజకీయ జోక్యం పెరగడం వల్ల సింగరేణి సంస్థకు గడ్డుకాలం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేసి సంస్థను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే స్పందించి అధికారులకు పీఆర్పీ అమలు చేయాలని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు అధికారులు చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు పూర్తి మద్దతు, సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, మైనింగ్ స్టాఫ్ బ్రాంచ్ కార్యదర్శి బాలకృష్ణ, జీఎం కార్యాలయ ఫిట్ కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## కవ్వాల్ అడవుల్లో పర్యటించిన ఎఫ్ సి ఆర్ ఐ విద్యార్థులు




**జన్నారం,జూన్30(ప్రజాజ్యోతి)**కవ్వాల్ టైగర్ జోన్ లోని జన్నారం డివిజన్ ఇంధనపల్లి రేంజ్ లో హైదరాబాదులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ కు చెందిన మూడవ సంవత్సరం విద్యార్థులు మంగళవారం పర్యటించారు. ఇంధనపల్లి రేంజ్ లోని కలమడుగు బీట్, కంపార్ట్మెంట్ నెంబర్ 333 లో ఇటీవల స్వాధీనం చేసుకున్న అటవీ భూమిని సందర్శించి, అటవీ భూమి పునరుద్ధరణ మరియు పరిరక్షణ చర్యలను పరిశీలించారు. అనంతరం వెదురు (బాంబూ) వర్క్ షాపులు సందర్శించి వెదురు ప్రాసెసింగ్ విధానాలు మరియు సుస్థిర అటవీ నిర్మాణంలో దాని ప్రాముఖ్యత గురించి వివరంగా తెలుసుకున్నారు.అక్కడినుండి బర్తన్ పేట సెక్షన్ కు వెళ్లి కామన్ పెల్లి మరియు నార్లాపూర్ సౌత్ బీటులలో నిర్వహించిన ట్రెక్కింగ్ లో పాల్గొన్నారు. అటవీ పర్యావరణ వ్యవస్థ, జీవవైవిధ్యం, అటవీ సంరక్షణ చర్యలు మరియు క్షేత్రస్థాయి అటవీ నిర్వహణపై ఇంధనపెల్లి రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్షేత్ర పర్యటన ద్వారా విద్యార్థులు అటవీ సంరక్షణ, పునరుద్ధరణ, జీవవైవిధ్య పరిరక్షణ మరియు సుస్థిర అటవీ నిర్వాహనపై విలువైన ప్రాయోగిక పరిజ్ఞానం, క్షేత్ర స్థాయి అనుభవాన్ని పొందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ సి ఆర్ ఐ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎన్ ఎస్ శ్రీనిధి,పర్సీ, ములుగు, సిద్దిపేట ఎఫ్ఎస్ఓ లు హనుమంతరావు,శేషారామ్, ఎఫ్.బి.ఓ లు పోచయ్య,రాజేశ్వర్, డాక్టర్ అనగందుల వెంకట్, టెక్నికల్ అసిస్టెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

అర్హులంతా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచన



**ఆసిఫాబాద్ జూన్ 30 ప్రజా జ్యోతి** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేద కుటుంబాలకు ఆర్థిక సాయంగా చెక్కులను స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదలు అనారోగ్యం బారిన పడినప్పుడు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం చేయూత అందిస్తోందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చు చేసిన నిరుపేద కుటుంబాలకు ఈ సా యం ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ నియోజక వర్గంలో ఇప్పటికే వేలాది మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందించామని తెలిపారు.ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన 15 రోజులలోపు దరఖాస్తు చేసుకుంటే సహాయం త్వరగా మంజూరయ్యే అవకాశం ఉంటుందని, దళారులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, కౌన్సిలర్లు చిలువేరి వెంకన్న, బాలకృష్ణ, సలాం, జబోరే రవీందర్, లక్ష్మణ్, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా పునరుద్ధరించాలి

డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు గుండి సర్పంచ్ వినతి



**ఆసిఫాబాద్ జూన్ 30 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండలంలోని గుండి గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుండి సర్పంచ్ జబరి రవీందర్ తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మిషన్ భగీరథ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శైలేందర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.గ్రామానికి మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని తక్షణమే సరఫరా చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ సంతోష్, వార్డు సభ్యుడు తిరుపతి తదితరులు సర్పంచ్ వెంట ఉన్నారు.

## వెల్ఫేర్ బోర్డు పథకాలను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించొద్దు: సీఐటీయూ




**ఆసిఫాబాద్ జూన్ 30 ప్రజా జ్యోతి** భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించకుండా, బోర్డు ద్వారానే కొనసాగించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆసిఫాబాద్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు అమలవుతున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్య పరిహారం వంటి పథకాలను జీవో నం.12 ద్వారా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడం కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు. క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్, ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలకు రూ.346.36 కోట్లు కేటాయించడం అన్యాయమని అన్నారు.సీఎస్‌సీ హెల్త్ టెస్టులను వెంటనే రద్దు చేయాలని, సహజ మరణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పేర్లపై ప్రీమియం చెల్లింపులతో వెల్ఫేర్ బోర్డు నిధులు తగ్గిపోతున్నాయని, మరోవైపు కార్మికులకు చెల్లించాల్సిన నష్టపరిహారాలు వేల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.అలాగే నిర్మాణ కార్మికులందరికీ హెల్త్ కార్డులు జారీ చేయడంతో పాటు గడువు ముగిసిన సుమారు 13 లక్షల కార్డులను పునరుద్ధరించాలని కోరారు. డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, జిల్లా కోశాధికారి ఆనందరావు, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు కమలాకర్, కార్యదర్శి నరసయ్య, రామ్‌చందర్, సదయ్య, ముబిన్, తిరుపతి, రవి తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీసీపీ ఏ. భాస్కర్

**పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి నేరాల నియంత్రణ, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన**

**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసు సేవలను మరింత సమర్థవంతం చేయాలని ఆదేశం**



**మంచిర్యాల, 30,జూన్ రామగుండం** పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్ డీసీపీ ఏ. భాస్కర్ మంగళవారం మంచిర్యాల రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, వివిధ రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటి దర్యాప్తు వివరాలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు.సర్కిల్ పరిధిలో రోజువారీగా నమోదవుతున్న ఫిర్యాదులు, కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన డీసీపీ, పెండింగ్ కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టులు, కేసుల దర్యాప్తు పురోగతిపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. సంబంధిత ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలిస్తూ కేసుల విచారణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసు అధికారులు, సిబ్బంది విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్ (క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్), ఈ-సాక్ష్య వంటి డిజిటల్ వ్యవస్థల ద్వారా కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను శాస్త్రీయంగా నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. అలాగే హెచ్ఆర్ఎంఎస్ ద్వారా అందుబాటులో ఉన్న సేవలను పోలీసు సిబ్బంది సమర్థంగా వినియోగించు కోవాలని తెలిపారు.పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి, వారి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రజల పట్ల బాధ్యతా యుతంగా, జవాబుదారీ తనంతో వ్యవహరిస్తూ ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిష్కరించాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి భద్రత, భరోసా కల్పించే విధంగా పోలీసు వ్యవస్థ పనిచేయాలని పేర్కొన్న డీసీపీ, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయవచ్చని తెలిపారు.మంచిర్యాల రూరల్ సర్కిల్ మొత్తం పనితీరు సంతృప్తికరంగా ఉందని డీసీపీ అభినందిస్తూ, ఇదే సేవాస్ఫూర్తితో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

# ఇందిరమ్మ ఇళ్లకు అదనంగా ఐదు ఇసుక ట్రిప్పులు కేటాయించాలి

**ఇసుక ధరలతో ఇందిరమ్మ లబ్ధిదారుల లబోదిబో**

**రూ.7 వేల వరకు ఇసుక ధరలు.. పేదలపై అదనపు భారం**

**ప్రైవేటు ఇసుక ధరలను నియంత్రించాలి.. కలెక్టర్‌కు విజ్ఞప్తి**

**ఇసుక సిండికేట్‌పై చర్యలు తీసుకోవాలి: ఉప్పుల క్రిష్ణ**



**ఆసిఫాబాద్ జూన్ 30 ప్రజా జ్యోతి** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం కింద లబ్ధిదారులకు ప్రస్తుతం ఎనిమిది ట్రిప్పుల ఉచిత ఇసుకను మాత్రమే కేటాయిస్తున్నారని, అయితే ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేయడానికి ఆ ఇసుక సరిపోవడం లేదని వాంకిడి యూత్ మండల అధ్యక్షుడు ఉప్పుల క్రిష్ణ అన్నారు.ఎనిమిది ట్రిప్పుల ఇసుక పూర్తయిన తర్వాత అదనపు ఇసుక కోసం లబ్ధిదారులు ప్రైవేటు ట్రాక్టర్లను ఆశ్రయించాల్సి వస్తోందని, దీనిని కొందరు ఇసుక వ్యాపారులు, ట్రాక్టర్ యజమానులు అవకాశంగా మార్చుకుని అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ.5,000 నుంచి రూ.7,000 వరకు వసూలు చేస్తున్నారని, దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం భారంగా మారిందని తెలిపారు.ఇసుక ధరలు విచ్చలవిడిగా పెరగడంతో లబ్ధిదారులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం సరిపోక అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాన్ని కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కొందరు ట్రాక్టర్ యజమానులు సిండికేట్‌గా మారి ఇసుక ధరలను కృత్రిమంగా పెంచుతున్నారని, దీనివల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అదనంగా మరో ఐదు ట్రిప్పుల ఉచిత ఇసుకను కేటాయించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఉప్పుల క్రిష్ణ కోరారు. అలాగే ఇసుక ట్రాక్టర్ యజమానులతో సమావేశం నిర్వహించి, ప్రభుత్వ నిర్ణయించిన సాధారణ ధరలకే ఇసుక రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఇసుక ధరలను నియంత్రించి లబ్ధిదారులపై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని తగ్గించాలని ఆయన కోరారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ వెంటనే స్పందించి ఉచిత ఇసుక ట్రిప్పుల సంఖ్యను పెంచడంతో పాటు ఇసుక ధరల నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలని వాంకిడి యూత్ మండల అధ్యక్షుడు ఉప్పుల క్రిష్ణ విజ్ఞప్తి చేశారు.

# శ్రీరాంపూర్ ఏరియా బీసీ లైజన్ ఆఫీసర్ ఎన్. సత్యనారాయణకు ఘనంగా ఆత్మీయ పదవీ విరమణ సన్మానం

**మంచిర్యాల, 30,జూన్ (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా బీసీ లైజన్ ఆఫీసర్ మరియు ఎస్.ఓ. టు జీఎం శ్రీ ఎన్. సత్యనారాయణ పదవీ విరమణ సందర్భంగా సింగరేణి బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ఎన్. సత్యనారాయణ తమ ఉద్యోగ జీవితంలో బీసీ ఉద్యోగుల సంక్షేమం, సామాజిక న్యాయం మరియు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి విశేష సేవలు అందించారని కొనియాడారు. ఉద్యోగ జీవితమంతా ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, బీసీ ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేశారని తెలిపారు. ఆయన సేవలు బీసీ ఉద్యోగుల సంఘానికి చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బీసీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, బ్రాంచ్ కార్యదర్శి బద్రి బుచ్చయ్య, రఘురామ్, వర్క్‌షాప్ ఫిట్ సెక్రటరీ



వినోద్, సందీప్, శ్రీ సాంబయ్య, ప్రసాద్ తదితర బీసీ ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సంఘం తరపున ఎన్. సత్యనారాయణ దంపతులకు ఘనంగా సన్మానం చేసి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. పదవీ విరమణ అనంతర జీవితం ఆయురారోగ్యాలు, ఆనందం, సుఖసంతోషాలు, శ్రేయస్సుతో నిండి ఉండాలని శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి బీసీ అండ్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆకాంక్షించారు.


# వ్యవసాయం అంటే పండగలా తీర్చిదిద్దుతాం...

**రైతుల నుండి 2 లక్షల 88 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి నగదు జమ చేశాం...**

**మహిళల ఆర్థిక అభివృద్ధికి చేయూత అందించాం... రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి**

**జిల్లాలో పాల్గొన్న మంచిర్యాల జిల్లా కలెక్టర్, రైతులు**





**మంచిర్యాల, (ప్రతినిధి,జూన్ 30 (ప్రజా జ్యోతి):** రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగలా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక నుంచి రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం లో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగే శ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకా టి శ్రీహరి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని రైతు వేదికల ద్వారా జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి మాట్లాడు తూ ప్రజాపాలన ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్య త ఇస్తున్నామని, గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా ఏర్పడిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్క రిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లిస్తు న్నామన్నారు. రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ పథకం కింద 25 లక్షల 35 వేల మం ది రైతులకు రూ.20,677 కోట్ల మేర రుణమా ఫీ చేసినట్లు తెలి పారు. రైతు భరోసా పథకం కింద సంవత్సరానికి ఎకరానికి రూ. 12 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నామని, ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.27 వేల కోట్లు జమ చేశామని తెలిపా రు. ప్రస్తుతం మరో రూ.9 వేల కోట్లు విడుదల చేస్తున్నామని, మొత్తం రైతు భరోసా కోసం రూ.36 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగానికి రూ.30 వేల కోట్లు, బోనస్ కోసం రూ.4 వేల కోట్లు, వ్యవసాయ పనిముట్ల కోసం రూ.2 వేల కోట్లు, రైతు భీమా పథకం కోసం రూ.3,500 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా రైతుల నుంచి 2 లక్షల 88 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.80 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. వ్యవసాయ రంగం కోసం ఇప్పటివరకు మొత్తం రూ.1 లక్ష 75 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రతి నెల సగటున రూ.6 వే ల కోట్లు వ్యవసాయ రంగంపై వ్యయం చేస్తున్నామని వివరించారు. నష్టాల్లో ఉన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను వెయ్యి కోట్ల రూపాయల లాభాల్లోకి తీసుకొచ్చామని, సింగరేణి, విద్యుత్, ఆర్థిక, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రెవెన్యూ శాఖలో భూ భారతి కార్యక్రమం ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల సంక్షేమంలో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఇప్పటివరకు రూ.11 వేల కోట్లు ఆర్టీసీకి చెల్లించినట్లు తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం సౌర విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణకు అవకాశాలు కల్పించామని చెప్పారు. హైదరాబాద్‌లో ఐటీ సంస్థల మధ్య వెయ్యి కోట్ల రూపాయల విలువైన భూమిని ఇందిరా మహిళ భవన్ కోసం కేటాయించి, స్వయం సహాయక సంఘాల ద్వారా 150 దుకాణాల నిర్వహణకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా గ్రూప్--1 ద్వారా 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించామని, గ్రూప్--2లో 1,100 మంది నియామకాలు చేపట్టామని, అన్ని ప్రభుత్వ శాఖల్లో దాదాపు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించి కాలానుగుణంగా దిగుబడి వచ్చే పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తోందని, ప్రతి రంగానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట రైతు వేదిక నుంచి మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతి నిధులు, రైతులు పాల్గొని వీక్షించారు.

## మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపాలి

**జిల్లా కలెక్టర్ కె. హరిత**



**ఆసిఫాబాద్ జూన్ 30 (ప్రజా జ్యోతి)** జిల్లాలో మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, మెడికల్ షాపులు, బెల్ట్ షాపులు, కల్లు డిపోలను తరచూ తనిఖీ చేయాలని సూచించారు. గంజాయి సాగు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల సమీపంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, విద్యార్థులు, ప్రజలకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగా హన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్పీ నితికా పంత్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాధితుడికి అండగా సీఎంఆర్ఎఫ్: చెక్కు అందజేసిన సర్పంచ్

**--ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో ?60,000 మంజూరు**



**నేరడిగొండ, జూన్ 30 (ప్రజా జ్యోతి):** రోడ్డు ప్రమాదానికి గురై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఓ బాధితుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి రూపంలో అండ దొరికింది. బోథ్ శాసనసభ్యులు అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు మంగళవారం నేరడిగొండ మండలం సవర్గం గ్రామానికి చెందిన బాధితుడికి ఆయన నివాసంలోనే చెక్కును అందజేశారు. గ్రామానికి చెందిన రాథోడ్ విజయ్ గత కొన్ని రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం భారీగా ఖర్చు కావడంతో, ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్న విజయ్ పరిస్థితిని గమనించిన సవర్గం గ్రామ సర్పంచ్ జాదవ్ కళ్యాణి మహేందర్.. ముఖ్యమంత్రి సహాయ నిధి సహాయం కోసం దరఖాస్తు చేయించారు. బాధితుడి పరిస్థితిపై స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వం నుండి రూ. 60,000 (అరవై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించారు. ప్రస్తుతం బాధితుడు విజయ్ నడవలేని స్థితిలో మంచానికే పరిమితం కావడంతో, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మంగళవారం సర్పంచ్ జాదవ్ కళ్యాణి మహేందర్ స్వయంగా బాధితుడి ఇంటికి వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కష్టకాలంలో తమకు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కి ఎప్పటికీ రుణపడి ఉంటామని బాధితుడు రాథోడ్ విజయ్ భావోద్వేగానికి లోనయ్యారు. నడవలేని స్థితిలో ఉన్న తమ బాధను అర్థం చేసుకుని, కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ఇంటికే చెక్కు పంపించడం గర్వించదగ్గ విషయమన్నారు. నియోజకవర్గ ప్రజల కష్టాలను తీరుస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ లాంటి నాయకుడు దొరకడం బోథ్ నియోజకవర్గ ప్రజల అదృష్టమని ఈ సందర్భంగా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు - డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన



**నేరడిగొండ, జూన్ 30( ప్రజాజ్యోతి ):** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ( డి ఎం హెచ్ ఓ ) డాక్టర్ సాధన గారు సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. కట్ ఆఫ్ గ్రామాల్లోని గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, హై-రిస్క్ ఏఎన్సీ గర్భిణీలను నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు.ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మండలంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వేను నిర్వహించాలని, ప్రతి ఒక్కరికీ వైద్య శిబిరాల ద్వారా వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. అలాగే టీబీ (క్షయ) వ్యాధి పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, లక్షణాలు ఉన్నవారికి తక్షణమే పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సద్దాం, హెల్త్ విజిటర్ స్వర్ణలత, హెల్త్ సూపర్వైజర్ సంతోష్ మరియు ఆరోగ్య శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై అన్ని వర్గాల పౌరు లంతా అవగాహన కలిగి ఉం డాలి

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆరెల్లి మల్లేష్**



**జైనథ్, జూన్ 30, (ప్రజా జ్యోతి)**భారత రాజ్యాంగం కల్పించిన హక్కులపై అన్ని వర్గాల ప్రజలు అవగాహన కలిగి ఉండాల ని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ జిల్లా విజిలెన్స్ అండ్ మాని టరింగ్ కమిటీ సభ్యులు ఆరెల్లి మల్లేష్ అన్నారు. మంగళ వారం జైనథ్ మండలం కరంజి గ్రామంలో స్థానిక తాసిల్దార్ అత్రం నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలోఆయన ముఖ్యఅతిథి గా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడు తూ ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగం, మన భారత రా జ్యాంగం దేశంలోని చిన్న, పెద్ద ధనిక, పేద కులము, మత ము వర్గ వర్ణ భేదాలు లేకుం డా సమానత్వంతో కూడిన హక్కులను ప్రసాదించడం జరిగిందని, ఈ నేపథ్యంలోఈ దేశ పౌరులైన మనం ఒకే జా తీయులుగా కుల వివక్షత అ సమానతలు లేకుండా సమా నంగా జీవించేందుకు ఒకరి నొకరు గౌరవిస్తూ ప్రజాస్వా మ్య స్ఫూర్తిని చాటాలని, చట్టాలను శాంతితో మెలగాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ప్రజలు తమ సమస్యలను స్థానిక మండల, జిల్లా అధికార యంత్రం గానికి విజ్ఞప్తిలు చేసుకోవాలని, అలాం టి సమస్యలకు వారధిగా తాము ఎల్లప్పుడూ ప్రజలకు అందు బాటులో ఉంటూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపా డేందుకు బాధ్యతతో ముందు ఉంటామని సందర్భంగా తెలి పారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొని విజయ వంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# హిందీ సాహిత్య సేవలకు జాతీయ గుర్తింపు

'కబీర్ కోహినూర్ సమ్మాన్'తో విద్యాసాగర్ జామి ప్రసాదరావుకు సత్కారం.

– రాజస్థాన్‌లో జరిగిన 629వ కబీర్ జయంతి మహోత్సవాల్లో పురస్కార ప్రదానం.

– హిందీ భాష, సాహిత్యాభివృద్ధికి చేసిన సేవలకు గుర్తింపు.

**మందమర్రి, జూన్ 30(ప్రజాజ్యోతి ):**మంచిర్యాల జిల్లా, మందమర్రి లోని సింగరేణి కాలరీస్ పాఠశాలలో సీనియర్ హిందీ పండితుడిగా విధులు నిర్వహిస్తున్న విద్యాసాగర్ జామి ప్రసాదరావుకు ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారం 'కబీర్ కోహినూర్ సమ్మాన్' లభించింది. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన అఖిల్ భారతీయ కబీర్ మఠం, సద్గురు కబీర్ ఆశ్రమ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 629వ కబీర్ జయంతి మహోత్సవాల్లో భాగంగా ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు.జూన్ 28, 29 తేదీల్లో ఘనంగా జరిగిన ఈ మహోత్సవాల్లో హిందీ భాషా, సాహిత్య రంగాలకు విశేష సేవలు అందించినందుకు గాను విద్యాసాగర్ జామి ప్రసాదరావును ఈ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.ఇది ఆయన అందుకున్న ఐదవ జాతీయ స్థాయి పురస్కారం కావడం విశేషం. హిందీ సాహిత్యాభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ 'కబీర్ కోహినూర్ సమ్మాన్'తో సత్కరించారు.అదేవిధంగా కబీర్ మహోత్సవ కార్యక్రమంలో విద్యా,



సామాజిక అభివృద్ధికి దోహదపడేలా విద్యాసాగర్ జామి ప్రసాదరావు సంపాదకత్వంలో వెలువడిన పలు గ్రంథాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన విద్యావేత్తలు, సాహితీవేత్తలు, కవులు ఆయనను అభినందించి శు భాకాంక్షలు తెలిపారు.ఈ అవార్డు అందుకోవడం పట్ల విద్యాసాగర్ జామి ప్రసాదరావు ఆనందం వ్యక్తం చేస్తూ, హిందీ భాషా సాహిత్య సేవలో మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

# తేజాపూర్ గ్రామంలో నూతన ఎంపీడీవో జీవన్ రెడ్డి పర్యటన

**---ఎంపీడీవో కు ఘన సన్మానం**

**నేరడిగొండ, జూన్ 30 (ప్రజాజ్యోతి):**నేరడిగొండ మండల నూతన మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) గా బాధ్యతలు స్వీకరించిన జీవన్ రెడ్డి మంగళవారం మండలంలోని తేజాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని తాజా పరిస్థితులను, అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు.గ్రామానికి విచ్చేసిన నూతన ఎంపీడీవోను గ్రామ సర్పంచ్ వసుంధర నవీన్, ఉపసర్పంచ్ తెడ్డు రవి, పంచాయతీ సెక్రటరీ శ్రీదేవి, వార్డు మెంబర్ మౌలానా, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బద్దం పోతరెడ్డిలు శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామాభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.అనంతరం స్థానిక




జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలను సందర్శించగా.. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మనీలతా రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్ మరియు స్కూల్ సిబ్బంది కలిసి నూతన ఎంపీడీవోను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముచ్చటగా మూడు నెలలు గడవకముందే.. నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్!

**--నాణ్యత లేని పనులతో రైతులకు తప్పని తిప్పలు**

**నేరడిగొండ జూన్ 30( ప్రజా జ్యోతి ):**మండలంలోని కుమారి గ్రామంలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, నాణ్యతా లోపాలు అన్నదాతల పాలిట శాపంగా మారాయి. ముచ్చటగా మూడు నెలలు కూడా గడవకముందే లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కుప్పకూలి నేలమట్టమైంది. కుమారి గ్రామానికి చెందిన తుక్క రెడ్డి లక్ష్మారెడ్డి చేను ప్రాంతంలో విద్యుత్ సరఫరా కోసం రైతులు గత మూడు నెలల క్రితం డీడీలు చెల్లించగా ప్రభుత్వం ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసింది. దీని పరిధిలోని రైతులకు కనెక్షన్లు ఇచ్చిన గుత్తేదారు (కాంట్రాక్టర్), ఆ తర్వాత కనీస బాధ్యతను విస్మరించారు.

**బేస్‌మెంట్ లేకుండానే గద్దె నిర్మాణం!**

ట్రాన్స్‌ఫార్మర్ బరువును మోసే గద్దె (ప్లాట్‌ఫామ్) నిర్మాణానికి ఎలాంటి బేస్‌మెంట్ కట్టకుండా, నాణ్యత లేని సిమెంట్, ఇటుకలను వాడారని రైతులు మండిపడుతున్నారు. గద్దె లోపల కాంక్రీట్ వేయకుండా కేవలం రాళ్లను నింపి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. దీనివల్ల ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే గద్దె పూర్తిగా కుంగిపోయి, ట్రాన్స్‌ఫార్మర్ కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా దెబ్బతిని, పనికిరాకుండా పోయింది. చేతికొచ్చిన పంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**మరికొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలకు పగుళ్లు..**

కేవలం ఇక్కడే కాకుండా, కుమారి గ్రామానికి చెందిన ముల్కల్వాడు ప్రాంతంలో ఏర్పాటు చేసిన మరికొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు కూడా నాణ్యతా లోపంతో పూర్తిగా పగుళ్లు ఇచ్చాయి. ఇవి ఏ క్షణంలోనైనా కింద పడిపోయే ప్రమాదం పొంచి ఉందని స్థానిక రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.రైతుల డిమాండ్: ప్రమాదకరంగా మారిన ముల్కల్వాడు ప్రాంతంలోని గద్దెలను వెంటనే పునర్మించి, ట్రాన్స్‌ఫార్మర్లను సురక్షితంగా బిగించాలని రైతులు కోరుతున్నారు. అలాగే కుప్పకూలిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో సదరు కాంట్రాక్టర్ చేతనే మళ్లీ నాణ్యమైన గద్దెను నిర్మింపజేసి, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను గ్రామ రైతాంగం డిమాండ్ చేస్తోంది.

# రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు ఖాతాలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ లో వెల్లడి





ఖానాపూర్ జూన్ 30( ప్రజా జ్యోతి )రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తదితర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం సాయంత్రం హైదరాబాదు నుంచి రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాల నుంచి అన్ని రైతు వేదికల ద్వారా కలెక్టర్లు, రైతులు వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తాం. వ్యవసాయాన్ని పండుగలా చేశామని చెప్పారు. ఈ విడతతో 36 వేల కోట్ల రైతు భరోసా నిధులు జమ చేశాం అన్నారు. 26 వేల 670 కోట్లు రుణమాఫీతో పాటు 30 వేల కోట్లు ఉచిత విద్యుత్ కొరకు ఖర్చు చేశామని తెలిపారు. రైతు బీమా కింద 3500 కోట్లు వెచ్చించామని పేర్కొన్నారు. సగటున నెలకు రైతుల సంక్షేమం కొరకు 6 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా కూడా, రైతాంగ సంక్షేమానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈసారి వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున, తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని తెలిపారు. రైతులు పంట మార్పిడి విధానాలను అవలంబించాలన్నారు.నిర్మల్ గ్రామీణ మండలం చిట్యాల గ్రామంలోని రైతు వేదిక నుంచి ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డిఓ దేవదాస్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసిల్దార్ ప్రభాకర్, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సుప్రియ, రైతులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్లోరినేషన్ సమస్యతో బాధ పడుతున్న గ్రామానికి ఆర్వో వాటర్ ప్లాంట్





**పరస్వాడ(కె) గ్రామానికి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం**
**గ్రామంలో తాగునీటికి శాశ్వత పరిష్కారం**
**గంజాయి, గుడుంబా, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి**
**విద్య, ఆరోగ్యం, అభివృద్ధిపై దృష్టి పెట్టాలి**
**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 30, (ప్రజా జ్యోతి)గాదిగూడ మండలం పరస్వా డ(కె) గ్రామంలో తాగునీటి సమస్యను గుర్తించిన జిల్లా ఎ స్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ప్రత్యేక చొరవతో ఉచిత ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసి మంగళ వారం గ్రామ ప్రజల సమక్షంలో ఘనంగా ప్రారంభించారు. మొదటగా గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు ఆదివాసీ సంప్ర దాయాల నడుమ డప్పు వాయిద్యాలతో జిల్లా ఎస్పీకి ఘన స్వాగతం పలికారు. గతంలో తీవ్రమైన క్లోరినేషన్ సమ స్య కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న తమ గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి నందుకు గ్రామ ప్రజలు జిల్లా పోలీస్ శాఖకు హృదయ పూ ర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తుల సమక్షంలో వేద మంత్రోచ్చారణల నడుమ ఆ ర్వో ప్లాంట్ ను గ్రామ పెద్దలతో రిబ్బన్ కట్ చేసి ప్రారం భించారు. తదుపరి మహిళలు నీటిని తీసుకొని మొదటగా గ్రామంలో ఉన్న శివాల యంలో అభిషేకం నిర్వహించి పూజా కార్యక్రమాలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ ఆర్వోప్లాంట్‌ను బాధ్యతాయు తంగా నిర్వహించుకోవాలని, ప్రతి కు టుంబం శుద్ధి చేసిన తాగు నీటినే వినియోగించి ఆరోగ్యా న్ని కాపాడుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామ ప్రజలు, యువత గంజాయి, గుడుంబా, ఇతర మాదకద్ర వ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, గంజాయి సాగు, రవాణా, విక్రయం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. గంజాయి సాగు చేసిన వారి పేర్లను ప్రభుత్వానికి నివేదించి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్ర యోజనాలు నిలిపి వేయాలని సిఫార్సు చేయడం జరుగు తుందని స్పష్టం చేశారు. యువత చదువుపై పూర్తి దృష్టి సారించి ఉన్నత విద్యను అభ్య సించాలని, ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ రంగాల్లో రాణించి కుటుంబంతో పాటు గ్రా మాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యాభ్యాసం వైపు ప్రోత్సహించాలని కోరారు. రోడ్లపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలని సూచించారు. మూఢనమ్మకాలు, బాబాలు, ఫకీర్ల మాయ మాటలను నమ్మకుండా అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రభుత్వ లేదా ప్రైవేట్ అర్హత కలిగిన వైద్యులను మాత్రమే సంప్రదించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అనవసరంగా టాబ్లెట్లను మందులను వాడటం వల్ల కిడ్నీ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నందున వాటి వాడకాన్ని నియంత్రించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్వీక్ సాయి కొట్టే ఐపీఎస్, నార్నూర్ సీఐ బి. అంజమ్మ, గాదిగూడ ఎస్ ఐరమ్మ, గ్రామ సర్పంచ్ మ ర్సుకోల లక్ష్మణ్, సార్ మేడి దౌలత్ రావు, గ్రామ పెద్ద సిడాం మారు, గ్రామ ప్రజలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది సంగెం సుధీర్ కుమార్ కు ఘణ సన్మానం



ఆదిలాబాద్ టౌన్, జూన్ 30, (ప్రజా జ్యోతి)జిల్లా కోర్టులో న్యాయ వాదిగా సేవలందిస్తున్న న్యాయవాది సంగెం సుధీర్ కుమార్ ఘణంగా సన్మానించారు. సుదీర్ సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో చేస్తున్న సామాజిక సేవలకు ఇటీవలే ఈ ఎఫ్ బీ యూని వర్సిటీ వెల్లింగ్టన్ వారు గౌరవ డాక్టరేట్ డిగ్రీ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా న్యా యవాది సంగెం సుధీర్ కుమార్‌ను మంగళవారం జిల్లా కోర్ట్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ న్యాయ వాదులు దాసరి గంగారాం, అరుగుల అశోక్, చంద్రకాంత్ చౌదరీ, ఉమేష్ దోలే, సంగీత, తిలోత్తమలు శాలువాలతో స త్కరించారు.ఈ సందర్భం గా దాసరి గంగారాం మాట్లాడు తూ ఇంకా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ సుధీర్ కుమార్ సంగెం సేవల్ని ని కొనియాడారు.

## దళితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**





ఆదిలాబాద్ బ్యూరో,జూన్ 30, (ప్రజా జ్యోతి) దళిత సామాజిక వర్గాల ప్రజ ల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ స మావేశ మందిరంలో జిల్లా షె డ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ సంఘాల ప్రతినిధులతో ఆయన స మీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెల 15 న నిర్వహించిన సమావే శంలో ప్రతినిధులు ప్రస్తావించిన వివిధ సమస్యలు, అభ్య ర్థనలపై శాఖల వారిగా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు మెరు గైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే సమస్యల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తు న్నామని స్పష్టం చేశారు. అర్హు లైన ఎస్సీ లబ్ధిదారులకు ఇం దిరమ్మ ఇండ్లు, లేబర్ కార్డ్స్ అందజేత వంటి అంశాలపై అ ధికారులు క్షేత్ర స్థాయిలో పర్య వేక్షించాలనీ, ఎస్సీ, ఎస్టీ అట్రా సిటీ బాధితులకు అందించిన ఆర్థిక సహాయం వివరాలను, ప్రభుత్వ ఎస్సీ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరేలా తీసు కున్న చర్యలను నిశితంగా పరిశీలించాలన్నారు. రెవెన్యూ, గ్రామీణాభి వృద్ధి, సామాజిక సంక్షేమం, విద్య, వైద్యం తదితర శాఖల అధికా రులు క్షేత్ర స్థాయి సమస్యలను నిశితంగా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా స మావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్.చిత్రు, రాజేశ్వర్, డీఆర్ఓ స్రవంతి, జెడ్పీ సీఈ ఓ రవి, డీఆర్డీఓ రవీందర్, , జిల్లా షెడ్యూల్డ్ కులాల అభి వృద్ధి శాఖ అధికారి బీ. సునీత కుమారి, ఈడి మనోహర్, ఇతర శాఖల అధి కారులు, ఎస్సీ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ తీసుకున్న బాన్సుడే రాహుల్ కి తుడుందేబ్బ ఘణ సన్మానం

**పేదరికాన్ని జయించి పీ హెచ్ డీ సాధించిన మేడిగూడ యువకుడు బన్సుడే రాహుల్**




**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 30, (ప్రజా జ్యోతి)**పేదరికం జయించి పి హెచ్‌డి సాధించిన మేడిగూడ యువ కుడు బన్సుడే రాహుల్ ను తుడుం దెబ్బ నాయకులు ఘనంగా సన్మానించి సత్కరించారు ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులుగోడం గణేష్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా మారుమూల గాదిగూడ మండలం మేడిగూడ గ్రామానికి చెందిన బన్సుడే రాహుల్ అత్యంత క్లిష్టమైన ఆర్థిక ఇబ్బందులను అధిగ మించి పొలిటికల్ సైన్స్ (రాజ నీతి శాస్త్రం) విభాగంలో పీ హెచ్ డీ (డాక్టరేట్) పట్టా సాధించి అందరికీ ఆదర్శంగాని లిచారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన రాహుల్ తండ్రి బన్సుడే సిద్ధార్థ్ వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించగా, రాహుల్ చిన్నతనం నుండి ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూనే పట్టుదలతో చదువుకున్నారు. ఆయన 2022లో పీహెచ్‌డీలో ప్రవేశంపొంది, సిక్కిం ఆల్పైన్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ సునీత్ కాశివ్ పర్యవేక్షణలో "తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన వర్గాల్లో రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడంలో విద్య, మీడియా పాత్ర" అనే అంశంపైలో తైన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. తన గ్రామానికి, జిల్లాకు ఎనలేని గౌరవాన్ని తెచ్చిపెట్టిన రాహుల్, ప్రస్తుతం ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటి కల్ సైన్స్ విభాగంలో అతిథి అధ్యాపకుడిగా సేవలందిస్తున్నారు. అత్యంత పేదరికం నుండి ఎదిగి ఆయన సాధించిన ఈవిజయాన్ని తుడుందెబ్బ ప్రజాప్రతినిధులు అభినందించారు. చదువుపై పట్టుదల, కృషి ఉంటే ఎలాంటి పరిస్థితులనైనా అధిగమించి లక్ష్యాన్ని చేరుకోవచ్చని రాహుల్ తన విజయంతో నిరూ పించారని అన్నారు. ఈ కార్యక్రమంలోఅర్క శేషరావు, రాష్ట్ర కార్యదర్శి వెట్టి మనోజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పేందుర్ తుకారం, కోట్నక సక్కు, టిఎజిఎ జిల్లా ఉపాధ్యక్షులు పేందుర్ దిలిప్,సిడాం కాశీరాం మతదితరులు పాల్గొన్నారు.

## అశోక్ వర్మ సేవలు అభినంద నీయం



**లక్ష్మణ చాంద, జూన్ 30 (ప్రజా జ్యోతి)** మండలంలోని వడ్యాల్ గ్రామ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి మంగళవారం రోజున పదవీ విరమణ పొందిన సందర్భంగా అశోక్ వర్మను వారి దంపతులను నాయకులు ఘనంగా సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ అశోక్ వర్మ విద్యార్థులకు అందించిన సేవలు అభినందనీయమని అలాగే మండల ఇంచార్జ్ విద్యాశాఖ అధికారిగా కూడా మంచి సేవలను అందించారని నాయకులు కొనియాడారు. గత 8 సంవత్సరాల నుండి వడ్యాల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా విద్యార్థులకు మంచి సేవలను అందించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసుపుల నరేష్, ఏఎంసీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు కోండ్ర నరేష్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ రవి, సెక్రటరీ రాజా వర్మ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులైన ఏ ఒక్క ఓటు తొలగించకుండా బిఆర్ఎస్ నాయకులు అప్రమత్తంగా ఉండాలి

**మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 30, (ప్రజా జ్యోతి)** అర్హులైన ఏ ఒక్క ఓటు సైతం ఓటర్ జాబితా నుండి తొల గిం చకుండా చూడాల్సిన బాధ్యత బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల పై ఉందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారు గూడా కాలనీలో జరుగుతున్న సర్ సర్వే ప్రక్రియను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. పార్టీ నేతలతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ సర్ ప్రక్రియపై స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం పార్టీ బిఎల్ ఎలకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట స్థా నిక నేతలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఈ మేరకు మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ సర్ సర్వే పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రతి పక్షాల అనుకూల ఓట్లను తొలగించేందుకు కుట్ర పన్ను తోందని ఆరోపించారు. అర్హులైన ఏ ఒక్కరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా బి ఆ ర్ ఎస్ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ ప్రక్రియపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని, తద్వారా అర్హు లైన వారు ఓటు హక్కు కోల్పో కుండా ఉంటారని పేర్కొన్నా రు. ఇప్పటికే పార్టీ తరపున వి స్తృతంగా బిఎల్ ఎలకు అవ గాహన కార్యక్రమాలను నిర్వ హించినట్లు తెలియ చేశారు. బి ఎల్ ఓలు ఇచ్చిన ఎన్యు మరేషన్ ఫారాలను నింపి తిరిగి వారికి ఇవ్వాలని, తద్వారా ఓటు హక్కు కోల్పోకుండాఉం టుందని వివరించారు. ఈ కా ర్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అజ య్, సాజిత్ ఉద్దీన్, నారాయణ, సలీమ్ పాషా, అన్నెలా వసంత్, దమ్మాపాల్, బట్టు సతీష్, కుమ్ర రాజు, ఏ జాజ్, అశోక్, ఇశ్రాల్, సాజిత్ ఎస్మైల్, చంద్, రాజు, అఫ్రజ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సేవా సంస్థలు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 30, (ప్రజా జ్యోతి)**ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సేవా సంస్థలు సహకరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు మంగళవారం స్థానిక బొక్కల్ గూడాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెడ్ నంబర్ -2 లో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో చేపట్టిన ఆర్ ఓవాటర్ ప్లాంట్ యూనిట్, పటి షన్ వాల్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థద్వారా పాఠశాలలో టాయిలెట్ మరమ్మతులు చేయడం జరిగిందని, 40 డెస్క్ బెంచీలు, హ్యాండ్ వాష్ ఫ్లాట్ఫామ్‌లను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్ర మంలో జిల్లా విద్య శాఖ అధికారి మాధవి, నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సతీష్, అకడమిక్ కోఆర్డినేటర్లు లక్ష్మణ్, అజయ్, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పా ల్గొన్నారు.

# పేదరికాన్ని జయించి పీ హెచ్ డీ సాధించిన మేడిగూడ యువకుడు బన్సుడే రాహుల్



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 30, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా మారు మూల గాదిగూడ మండలం మేడిగూడ గ్రామానికి చెందిన బన్సుడే రాహుల్ అత్యంత క్లిష్టమైన ఆర్థిక ఇబ్బందులను అధిగ మించి పొలిటికల్ సైన్స్ (రాజనీతి శాస్త్రం) విభాగంలో పీహెచ్‌డీ (డాక్టరేట్) పట్టా సాధించి అందరికీ ఆదర్శంగా ని లిచారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన రాహుల్ తండ్రి బన్సుడే సిద్ధార్థ్ వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించగా, రాహుల్ చిన్నతనం నుండి ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూనే పట్టుదలతో చదువుకు న్నారు. ఆయన 2022లో పీహెచ్‌డీలో ప్రవేశం పొంది, సిక్కిం ఆల్పైన్ విశ్వవి ద్యాలయానికి చెందిన డాక్టర్ సునీత్ కాశివ్ పర్యవేక్షణలో "తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన వర్గాల్లో రాజ కీయ చైతన్యాన్ని పెంపొందించడంలో విద్య, మీడియా పాత్ర" అనే అంశంపై లోతైన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పట్టా అం దుకున్నారు. తన గ్రామానికి జిల్లాకు ఎనలేని గౌరవాన్ని తెచ్చిపెట్టిన రాహుల్, ప్రస్తు తం ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ క ళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగంలో అతిథి అధ్యాపకుడిగా సేవలందిస్తు న్నారు. అత్యంత పేదరికం నుండి ఎదిగి ఆయన సాధించిన ఈ విజయాన్ని మేడిగూడ గ్రామస్తులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు అభినందించారు. చదువుపై పట్టుదల, కృషి ఉంటే ఎలాంటి పరిస్థితులనైనా అధిగ మించి లక్ష్యాన్ని చేరు కోవచ్చని రాహుల్ తన విజయంతో నిరూపించారు.

# అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

**నీతి, నిజాయితీ, సమయ పాలనతో విధులు నిర్వహించి పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంచాలి**

**ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**నార్నూర్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 30, (ప్రజా జ్యోతి)**అసాంఘిక కార్యకలాపాలు నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించాలని, నీతి నిజాయితీ సమయ పాలనతో విధులు నిర్వహించి పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంచాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తనిఖీ చేశారు. స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, పరిపాలనా నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా గంజాయి, గుడుంబా, దేశీదారు తయారీ, రవా ణా, విక్రయాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గంజాయి నిర్మూలనకు సమాచారం అందించే పోలీసు సిబ్బందిని ప్రోత్సహించేందుకు నగదు రివార్డులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, గ్యాంబ్లింగ్, గేమింగ్, నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలు, ఈ-పెట్టీ కేసులు వంటి అంశాలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి, చార్జ్‌షీట్లు సకాలంలో దాఖలు చేయాలని సూచించారు. స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి, నాణ్యమైన దర్యాప్తుతో ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని తెలిపారు. ముఖ్యంగా పోలీస్ శాఖ అమలు చేస్తున్న వర్టికల్స్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. బ్లూ కోర్ట్, రిసెప్షన్, సీడీఎఫ్, చార్జ్ షీట్స్, సస్పెక్ట్ షీట్స్, రౌడీ షీట్స్, 5ఎస్ విధానాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది నీతి, నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలనతో విధులు నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని, సమాజంలో పోలీసు శాఖ కీర్తి ప్రతిష్టలు ఇనుమడించేలా సేవలందించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, నార్నూర్ సీఐ బి. అంజమ్మ, ఎస్ఐ శ్రీ సాయి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ కృష్ణయ్య చిత్ర పటానికి పాలాభిషేకం



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 30, (ప్రజా జ్యోతి)** జాతీయ వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య చిత్ర పటానికి మంగళవారం ఆదిలాబాద్‌లో జిల్లా అధ్యక్షులు ఆవులరాఘు వేంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. జాతీయ వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య పిలుపుమేరకు ఫీజు రియంబర్స్మెంట్ విషయం మై మంగళవారం యావత్ తెలంగాణ రాష్ట్రం కళాశాలల బంద్ కు పిలుపు నిచ్చారు. దీనికి స్పందించి తెలంగాణ ప్రభుత్వం రూ 250 కోట్లు కేటా యించిందని, ఇది కృష్ణయ్య విజయ మేనని జిల్లా అధ్యక్షుడు రాఘు వేంద్రనాథ్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం చేయడం జరిగిందని తెలిపారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్య త్తుకు బాటలు వేయడంలో అ ధ్యాపకుల పాత్ర అత్యంత కీలకం

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 30, (ప్రజా జ్యోతి )** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక జిల్లా ఇంటర్మీడియేట్ కార్యాలయంలో మ్యాథ్స్ లెక్చరర్లకు నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మక తను వెలికితీస్తూ, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చాల్సిన బాధ్యత అధ్యాపకులపైనే ఉందన్నారు. కేవలం పాఠ్యాం శాలను బోధించడమే కాకుం డా, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఉపాధ్యాయులు తమనైపుణ్యాలను నిరంతరం పెంపొం దించుకో వాలని సూచించారు. ఇందుకోసమే ప్రభుత్వం ప్రత్యేకంగా నెల రోజుల శిక్షణా తర గతులను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ శిక్షణలో నేర్చుకు నే నూతన బోధనా పద్ధతులను తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేస్తూ, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ బాధ్య తగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియేట్ విద్యా శాఖ అధికారి జాదవ్ గణేష్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ టి అరుణ్ కుమార్, వివిధ క ళాశాలల ప్రిన్సిపాల్స్, ప్రభు త్వ జూనియర్ కళాశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల వి ద్యాలయాలు, ఇతర జూని యర్ లెక్చరర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ ఆలోచన విధానం వల్లనే నేడు బలహీన వర్గాల పిల్లలకు ఉన్నత చదువులు






**మైనార్టీ గురుకులాన్ని సందర్శించిన మాజీ మంత్రి జోగు రామన్న**

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 30, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ పట్టణంలోని బంగారీ గూడాలోని ఆదిలాబాద్ మైనార్టీ గురు కులాన్ని మాజీ మంత్రి జోగు రామన్న సందర్శించి అక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కెసిఆర్ ఆలోచన విధా నంతో నేడు మైనార్టీలతో పాటు బడుగు బలహీన వర్గాల పిల్లలు సైతం ఉన్నత విద్యను అందుకో గలుగుతున్నార న్నారు. నేడు డాక్టర్ ఇంజనీర్లుగా మంచి విద్యావంతులుగా గుర్తింపు రావడం జరుగుతుందని పేర్కొన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో బడుగు, బలహీన వర్గాలు, పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్య మైన ఉన్నత విద్య అందించా లనే లక్ష్యంతో దేశంలో ఎక్క డా లేని విధంగా సుమారు 1000 గురుకులాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఆది లాబాద్ మైనార్టీ గురుకుల భవనం కూడా గత ప్రభుత్వ హ యాంలో కేటాయించిన నిధులతో పూర్తయిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం శిలాఫలకాల కోసం ప్రారంభోత్సవాలు నిర్వహించుకోవడం విచార కరమని విమర్శించారు. మైనార్టీ గురు కులాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ మంత్రులు, చైర్మన్లు అక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయులను కలిసి కనీస వసతులు ఉన్నాయా లేదా అని కూడా తెలుసు కో కుండా వెళ్లిపోవడం బాధాక రమని అన్నారు. ఈ సందర్భ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు గురుకులంలో నెలకొన్న సమస్యలను జోగు రామన్న దృష్టికి తీసుకు వచ్చారు. గురుకుల ప్రాంగణంలో స్ట్రీట్ లైట్లు లేకపోవడం, మొక్కలు నాటక పోవడం, చెట్లు లేకపోవడం వంటి కారణాలతో ఇబ్బందులు ఎదు ర్కొంటున్నామని తెలిపారు. ఈ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జోగు రామన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో పట్టణ అధ్యక్షులు అజయ్, సాజిదుద్దీన్, నారాయణ, సలీమ్ పాషా,అన్నెలా వసంత్, దమ్మా పాల్, బట్టు సతీష్, కుమ్ర రాజు, ఏజాజ్, అశోక్, ఇర్శాల్, సాజిత్ ఎస్మైల్, చంద్, రాజు, అఫ్రజ్, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని ఆహార పదార్థాల తయారీదారులపై కఠినంగా వ్యవహరించాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశాలు జారి**



**ఖానాపూర్ జూన్ 30 (ప్రజా జ్యోతి )** నిర్మల్ జిల్లాలోని ఆహార పదార్థాలు దుకాణదారులంతా ఖచ్చితంగా నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆహార భద్రతపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, మిఠాయి దుకాణాలు, దాబాలు, ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల నిర్వాహకులు ఆహార భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడం ప్రతి వ్యాపారి బాధ్యత అని అన్నారు. వంటల తయారీలో ఉపయోగించే నూనెలు, మసాలా దినుసులు, పాలు, పెరుగు తదితర ముడి పదార్థాలు నాణ్యమైనవే వినియోగించాలని అన్నారు. ఆహార భద్రత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ, దుకాణాల లైసెన్సులు సరి చూడాలని పేర్కొన్నారు. ముడి పదార్థాల గడువు తేదీలను, లేబుళ్లను ఎప్పటికప్పుడు చూడాలన్నారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను వినియోగించినా, ఫుడ్ కలర్లను వాడినా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, కోడిగుడ్లు, పాలు, పాల పదార్థాలు, మాంసం వంటి ఆహార పదార్థాలు తాజావే వాడుతున్నారో లేదో చూడాలని చెప్పారు. అపరిశుభ్రమైన, గడువు ముగిసిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయించినా, దుకాణాల్లో నిల్వఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు అమలవుతున్నాయో లేదో నిత్యం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. లిపలువురు అంగన్వాడీలకు ప్రశంస పత్రాలు అనంతరం, ఇటీవలి ఫుడ్ సేఫ్టీ అంశం మీద శిక్షణ పొందిన పలువురు అంగన్వాడి టీచర్లకు కలెక్టర్, అధికారులు సర్టిఫికెట్లను అందించారు. ఈ సమావేశంలో జిల్లా ఆహార భద్రత అధికారి సునీత, వైద్యారోగ్య అధికారి రాజేందర్, డిడబ్ల్యూవో వినూత్న, డిపివో శ్రీనివాస్, డిఈఓ భోజన్న, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# దేశాయ్ బీడీ కంపెనీ తరలింపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలి

– కార్మికుల వినతి



**సోనాల, జూన్ 30 ( ప్రజాజ్యోతి ):** సోనాల మండల కేంద్రంలో ఎన్నో సంవత్సరాలుగా వందలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తూ వస్తున్న దేశాయ్ బీడీ కంపెనీని ఇతర ప్రాంతానికి తరలించే నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని కోరుతూ ఈరోజు కంపెనీ కార్మికులు బీఆర్ఎస్ సోనాల గ్రామ కమిటీ అధ్యక్షులు పసుపునుటి చిన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, కంపెనీ తరలిపోతే వందలాది కుటుంబాలు ఉపాధిని కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సోనాల మండలంలో పరిశ్రమలు పెరగాల్సిన అవసరం ఉన్న సమయంలో ఉన్న పరిశ్రమలను తరలించడం మండల అభివృద్ధికి తీవ్ర నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. కంపెనీ యాజమాన్యం తమ నిర్ణయాన్ని పునఃపరిశీలించి, కార్మికుల జీవితాలను దృష్టిలో ఉంచుకుని తరలింపు నిర్ణయాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన బీఆర్ఎస్ సోనాల గ్రామ కమిటీ అధ్యక్షులు పసుపునుటి చిన్నయ్య కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సమస్యను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గారి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ తో కూడా చర్చించి, కంపెనీ యాజమాన్యంపై అవసరమైన ఒత్తిడి తీసుకొచ్చి తరలింపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేలా అన్ని విధాలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తుల శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ లంక లలిత, ఇర్ల అభిలాష్, బత్తుల రమేష్, గాజుల సుగుణకర్, కోస్మెట్టి శరత్, తుల హరీష్ పాల్గొన్నారు.

# అన్నదాతలకు అండగా ఉంటాం

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు భరోసా పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**సీతగొంది రైతు వేదికలో వైభవంగా రైతు భరోసా సదస్సు**

**ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 30, (ప్రజా జ్యోతి)** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గుడిహత్నూర్ మండలంలోని సీతగొంది గ్రామం రైతు వేదికలో 'రైతు భరో సా సదస్సు' పథకం మంగళ వారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారికంగా ప్రారంభించారు. ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్ర మానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన పథకం ప్రారంభోత్సవాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ తమ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. గత పాలనలో రైతులు ఎదుర్కొన్న కష్టాలను దూ రం చేస్తూ, సాగును పండుగ లా మార్చడానికే ఈ 'రైతు భ రోసా' పథకాన్ని ఎంతో ప్రతిష్టా త్మకంగా తీసుకువచ్చినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి నిరుపేద రైతుకూ, కౌలు రైతుకూ ఎక్కడా ఎలాంటి వివక్ష లేకుం డా, దళారీల ప్రమేయం లేకుం డా నేరుగా వారి ఖాతాల్లోకే పె ట్టుబడి సాయాన్ని జమ చేస్తు న్నామని సీఎం ప్రకటించారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా, రై తులకు రుణవిముక్తి కల్పిం చేందుకు తమ ప్రభుత్వం క ట్టుబడి ఉందని సీఎం పునరుద్ఘాటించారు. కేవలం పెట్టుబడి సాయం అందించడమే కా కుండా, సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేలా అధికార యంత్రాంగాన్ని అలర్ట్ చేశామని చెప్పారు. రైతులు అధైర్య ప డొద్దని, ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ మీకు వెన్నుదన్నుగా ఉంటుంద ని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షిషా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ వినూత్న పథకాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. సాగు పెట్టుబడి కోసం అన్నదాతలు అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతోనే, సరైన సమయానికి ఈ ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. సీతా గొంది గ్రామ రైతు వేదికలో ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం సంతోషక రమన్నారు. పారదర్శకంగా లబ్ధి చేకూర్చేలా, అర్హులైన ప్రతి రైతుకూ 'రైతు భరోసా' పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా, అత్యంత పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఈ పెట్టుబడి సాయా న్ని సద్వినియోగం చేసుకోవాలని, సంప్రదాయ పద్ధతుల్లోనే కాకుండా ఆధునిక వ్యవసాయ పద్ధతుల వైపు అడుగులు వేసి లాభాలు గడించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా పథ కంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం రైతులకు పత్తి విత్తనాల బ్యాగ్ లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా వ్యవసాయ అ ధికారి రవీందర్ సింగ్, తహసీ ల్దార్ కవితా రెడ్డి, సర్పంచ్ అనసూయ, మండల వ్యవ సాయ, ఉద్యానవన, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంఈవో రాథోడ్ ఉదయ్ రావ్..

**సేవలు చిరస్మరణీయం..**

**గుడిహత్నూర్ లో పదవి విరమణ**



**గుడిహత్నూర్ జూన్ 30, (ప్రజా జ్యోతి) :** విద్యాభి వృద్ధికి, విద్యార్థుల బం గారు భవిష్యత్ కు మండల విద్యాధికారి రాథోడ్ ఉదయ్‌రావ్ అందించిన సేవలు చిరస్మరణీయమని స్థానిక నాయకులు కొనియాడారు. అంకిత భావంతో పని చేస్తే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని వారు పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి రాథోడ్ ఉదయ్ రావ్ మంగళ వారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆత్మీయ సన్మానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయ కులు ఆయనను మర్యాద పూర్వ కంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్ప గుచ్ఛం అందజేసి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిహత్నూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తొడసం దౌలత్ రావ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ నాగనాథ్ అప్ప, లింగాపూర్ ఉప సర్పంచ్ మోతివార్ గణపతి, సీనియర్ నాయ కులు రాథోడ్ రమేష్, రామ్ కిషన్, ఆదే జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

## సిర్పూర్(టి) మండలం లోని సర్వే నంబర్ 520/ 524

**అదేవిధంగా పాత మాజీ సర్వే నెంబర్ 687/2, 691,692 694, 688 పరిధిలోని 38.05 ఎకరాలకు సంబంధిం చిన వివాదం**

**స్వాధీనానికి అటంకం కలిగే ప్రమాదం ఉన్నందు న,నివారణ అభ్యర్థన:**

**బిఎన్ఎస్ఎస్ 2023 లోని సెక్షన్ 164, పూర్వపు సెక్షన్ 148 సిఆర్పిసి పరిధిలో ఉంది. కోర్టు ఆదేశాలు వచ్చే వరకు:**

**ఎవరు ఎటువంటి మార్పు చేయరాదు అక్రమ ప్రవేశం చేయరాదు దీనిని ఉల్లంఘించిన వారిపై:**

**చట్ట ప్రకారం కఠిన చట్ట రీత్యా క్రిమినల్ చర్యలు తీసుకోబడును:**

**పోలీసుల సమక్షంలో బోర్డు పాతించడం జరిగింది.సిర్పూర్ (టి) తాహసిల్దార్ రహీముద్దీన్**





**జూన్ 30 సిర్పూర్(టి) నియోజక వర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి::** కొమురంభీం ఆసిఫా బాద్ జిల్లా సిర్పూర్ (టి)గ్రామ మండల కేంద్రంలోని- సర్వే నెం. 520/524 (పాత మాజీ సర్వే నెం. 687/2, 691, 692, 694 ఒ 688) పరిధిలోని 38.05 ఎకరాలకు సంబంధిం చిన వివాదం. శాంతి భంగం అదేవిధంగా ప్రస్తుత స్వాధీనానికి ఆటంకం కలిగే ప్రమాదం ఉన్నందున, నివారణ కోసం అభ్యర్థన బిఎన్ఎస్ ఎస్ 2023 లోని సెక్షన్ 164 (పూర్వపు సెక్షన్ 145 సిఆర్పిసికి సమానమైనది) పరిధిలోకి వచ్చును తదుపరి కోర్టు ఆదేశాలు వచ్చేవరకు ఎవరు ఎటువంటి మార్పు చేయరాదు లేదా అక్రమ ప్రవేశం చేయరాదు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చట్టరీత్యా క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిర్పూర్ (టి) తాహసిల్దార్ రహీముద్దీన్ తెలిపారు. ఇట్టి భూమిలో పోలీసుల సమక్షంలో ప్రభుత్వ బోర్డు పాతించడం జరిగిందని అన్నారు.

## నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

**మామడ జూలై 1 (ప్రజా జ్యోతి)**ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ కేంద్ర ప్రభుత్వ పథకం స్కిల్ ఇండియా ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు హోటల్ మేనేజ్మెంట్ కోర్సు మల్టీ ఫంక్షనల్ ఆఫీస్ అసోసియేట్ నర్సింగ్ కోర్సుల్లో శిక్షణనిచ్చి, ఉద్యోగ అవ కాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ జిల్లాకో ఆర్డినేటర్ తెలిపారు. 45 రోజులు ఉంటుందని, పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పాస్/ఫెయిలైన అభ్యర్థులు అర్హులన్నారు. వయస్సు 18నుంచి 35సంవత్స రాల్లో ఉండాలన్నారు. ఆసక్తి కలిగినవారు జూన్ 3 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9573940008 నంబర్ ను సంప్రదిం -చాలన్నారు.

# సిర్పూర్(టి)రుద్రారం పెద్ద బండ సమీపంలో జెసిబి లతో రాత్రి, పగలు అక్రమ మొరం ఇసుక తవ్వకాలు చేస్తూ

### లారీలతో తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని

### కొమురం భీం జిల్లా కలెక్టర్ హరిత కు ఫిర్యాదు చేసిన స్థానిక మండల నాయకులు:

**జూన్ 30, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాసిర్పూర్(టి) మండల కేంద్రంలోని రుద్రారం, పెద్ద బండ గ్రామల సమీపంలో జెసిబి లతో రాత్రి పగలు అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తూ లారీలో తరలిస్తు న్నారని స్థానిక నాయకు లు, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె, హరితకు ఫిర్యాదు చేశారు.స్థానిక నాయకులు జిల్లా కలెక్టర్ కె.హరిత తో మాట్లాడుతూ.... రుద్రారం,పెద్ద బండ గ్రామ సమీపంలోని సర్వే నంబర్: 84 పురంబోకు భూమి నుండి కొందరు వ్యక్తులు కొన్ని వేల క్యూబిక్ మీటర్ల మొరం జెసిబి ట్రక్కులతో తీసి లారీల్లో వివిధ ప్రాంతాలకు దొంగతనంగా అక్రమ రవాణా చేస్తూ తరలిస్తు న్నారని అన్నారు ఇప్పటి వరకు 30 నుండి 40 మీటర్ల లోతు తవ్వారని అన్నారు. అయినా మండల అధికారులు



పట్టించుకోవడంలేదని తెలిపారు. ఈ విషయం పై సిర్పూర్ కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లకు, తాసిల్దార్ రహీముద్దీన్ కు ఫిర్యాదు చేశామని అన్నారు. అయినా ఏ అధికారి పట్టించు కోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమ మోరం అధికారుల అనుమతి లేకుండా తరలిస్తు ప్రభుత్వ ఖనిజాలకు గండి కొడుతున్నారని అన్నారు. జెసిబి లతో ఇసుక, మొరం తవ్వకాలు చేసి లారీలతో తరలిస్తున్న అధికారులు మాత్రం చూసి చూడనట్టు వివాహరిస్తున్నారనిస్థానిక జిల్లా కలెక్టర్ హరితకు తెలిపారు. ఇప్పటికైనా వెంటనే స్పందించి జెసిబి లతో తవ్వి అక్రమంగా తరలిస్తున్న మొరం,ఇసుక అక్రమ రవాణాదారులపై చట్ట రీత్యా చర్యలు తీసుకొని వారిపై కేసులు నమోదు చేసి వారి వాహనాలను జప్తు చేయాలని స్థానిక నాయకులు జిల్లా కలెక్టర్ హరిత ను కోరారు.

## లంకె బిందల ఆశ... అత్తామామల కోసం కూతురు, అల్లుడు ఆత్మహత్య

**హైదరాబాద్ :** ఇంట్లో లంకెబిందెలు, గుప్తనిధులు ఉన్నాయంటూ ఓ సాధువు చెప్పిన మాటలను నమ్మిన అత్తమామలు.. తమ సొంత కూతురు, అల్లుడి ప్రాణాలనే బలితీసుకున్నారు. అల్లుడితో అప్పులు చేయించి.. ఆ తర్వాత మె?హం చాటేయటంతో మనస్థాపం చెందిన దంపతులు ప్రాణాలు తీసుకున్నారు. ఈ విషాదకర ఘటన హైదరాబాద్ శివారు మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మోకిల సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాలసాయి, పద్మ ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లయిన తర్వాత వారిద్దరూ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం పటేల్‌గూడలో నివాసముంటూ జీవనం సాగించేవారు. వీరికి ఐదు నెలల బాబు కూడా ఉన్నాడు. అయితే.. పెళ్లయిన కొన్ని రోజులకు ఈ దంపతులు అత్తగారి ఇంటికి వెళ్లారు. అదే సమయంలో పద్మ తల్లిదండ్రులైన శాంతమ్మ, చంద్రయ్య, అలాగే తోడల్లుడు వెంకటేష్ కలిసి బాలసాయికి ఒక కథ చెప్పారు. తమ ఇంట్లో కోట్ల విలువైన నిధి దాగి ఉందని.. దాన్ని వెలికితీయడానికి ఒక సాధువు పూజలు చేయాలని అందుకు రూ.10 లక్షల నగదు అత్యవసరంగా కావాలని అల్లుడు బాలసాయిని నమ్మించారు. అత్తమామల మాటలను నిజమేనని నమ్మిన బాలసాయి.. నాలుగు నెలల క్రితం తనకు తెలిసిన వారి వద్ద వడ్డీలకు రూ.10 లక్షలు అప్పు తెచ్చి అత్తమామల చేతిలో పెట్టాడు. ఆ డబ్బుతో వారు ఇంట్లో రహస్యంగా తవ్వకాలు జరిపారు. అయితే ఎంత తవ్వినా ఎలాంటి నిధి దొరకలేదు. దీంతో సాధువు మోసం చేశాడని తెలిసినా అత్తమామలు ఆ విషయాన్ని దాచిపెట్టారు. ఇటు చూస్తే అప్పు ఇచ్చిన వారు బాలసాయిపై రోజురోజుకూ ఒత్తిడి పెంచడం ప్రారంభించారు. అటు వైపు అత్తమామల నుంచి ఎలాంటి స్పందన లేదు. అవమానాలు, వేధింపులు ఎక్కువ కావడంతో బాలసాయి తన అత్త, మామ, తోడల్లుడిని డబ్బులు తిరిగివ్వాలని కోరాడు. కానీ వారు నయాపైసా కూడా ఇవ్వకుండా చేతులెత్తేశారు. అప్పుల ఊబి నుంచి ఎలా బయటపడాలో దిక్కుతోచని స్థితిలో తీవ్ర మనస్తాపానికి గురైన బాలసాయి, పద్మ తమ ఐదు నెలల పసికందును చూసి కన్నీరుమున్నీరయ్యారు. చివరకు స్వగ్రామమైన జన్వాడకు వచ్చి ఇద్దరూ కలిసి జూన్ 28న బలవన్మరణానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతుడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. 'అందరూ మమ్మల్ని క్షమించాలి. నేను, నా భార్య... మా అత్త, మామల మాటలు నమ్మి దారుణంగా మోసపోయాం.' అని మెసేజ్ ఉండటంతో ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు.

## ఫడ్నవిస్‌తో పవన్ భేటీ

ముంబై : మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నీవీస్‌తో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు. ఇద్దరు నేతలు ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశాలపై చర్చించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడ పులులు ఇచ్చే అంశంపై ఇద్దరు చర్చించారు. ఏపీకి రెండు ఆడ పులులు ఇస్తున్నందుకు మహారాష్ట్ర సీఎంకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిశారు. ముంబైలోని మహారాష్ట్ర ముఖ్యమంత్రి వారి క్యాంపు కార్యాలయంలో సమావేశమైన పవన్, ఫడ్నవీస్‌లు.. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. తూర్పు కనుమల్లో పులుల సంరక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి రెండు ఆడపులులను ఇవ్వాలని నిర్ణయం తీసుకోగా.. పవన్ సీఎం ఫడ్నవీస్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో రెండు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలలో పరస్పరం మరింత సహకరించుకోవాలని పవన్, ఫడ్నవీస్‌లు నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తూర్పు కనుమలలో ఆడ పులుల సంఖ్య గణీనీయంగా తగ్గిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. అందుకే పులుల సంఖ్య పునరుద్ధరణ కోసం మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకున్నామని.. ఏపీకి రెండు ఆడ పులుల్ని ఇచ్చేందుకు అంగీకరించిందని పేర్కొన్నారు. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుందని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చే ఆడ పులులు తూర్పు కనుమల్లో ప్రవేశంతో అంతరసంతానోత్పత్తిసమస్యల్ని అధిగమించొచ్చన్నారు. అంతేకాదు జన్యు వైవిధ్యం పెరిగి, పులుల సంఖ్య దీర్ఘకాలిక స్థిరత్వానికి దోహదపడుతుందన్నారు. తూర్పు కనుమలలో పులుల ఆవాస వ్యవస్థ ఏర్పడుతుందన్నారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంరక్షణ కార్యాచరణ శాస్త్రీయ విధానాలు, స్థిరమైన వన్యప్రాణి నిర్వహణ ఆధారంగా జీవ వైవిధ్య పరిరక్షణకు కట్టుబడి ఉన్న విషయాన్ని ప్రతిబింబిస్తోందన్నారు పవన్ కళ్యాణ్. 'ఆంధ్రప్రదేశ్?మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఏర్పడిన ఈ భాగస్వామ్యం తూర్పు కనుమలలో పులుల దీర్ఘకాలిక సంరక్షణకు విశేషంగా దోహదపడుతుందని విశ్వసిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మాకు నిరంతరం మార్గదర్శకత్వం అందిస్తున్న కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.